


కడప కింగ్ ఎవరో..!

- ఢిల్లీకి పోయేదెవరో..
- తొలినాళ్లలో కమ్యూనిస్టుల ఖిల్లా
- ఒకసారి టీడీపీ రెపరెప
- కాంగ్రెస్, వైసీపీలకే పట్టం
- ఈసారి ముక్కోణపు పోటీ
- టీడీపీ నుంచి భూపేష్‌రెడ్డి
- కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిలారెడ్డి, వైసీపీ నుంచి ఎంపీ అవినాష్
- కాకరేపుతున్న కడప పార్లమెంటు పాలిటిక్స్

కడప అంటే ఓ ప్రత్యేకత. ఇక్కడ రాజకీయాలంటే సర్వాత్రా ఆసక్తి. జిల్లాలో జరిగే ప్రతి ఎన్నికపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ఫోకస్ ఉంటుంది. ఎందుకంటే కడప జిల్లా అంటే రాజకీయంగా వైఎస్ కుటుంబానికి కంచుకోట అని అందరూ భావిస్తారు. అందుకు తగ్గట్లుగానే ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన ప్రతి ఎన్నికల్లో వారి హవా కొనసాగింది. అయితే ఇదంతా గతం.. ఇప్పుడు సీన్ మారింది. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్ సోదరుడు, వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురికావడం.. ఆ ఎన్నికల్లో సానుభూతి పొంది న జగన్ ముఖ్యమంత్రి కావడం తెలిసిందే. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్ కుమార్తె, జగన్ సోదరి షర్మిల కడప పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి.. వివేకా హత్యనే ప్రధానంగా ప్రస్తావిస్తూ.. హంతకులను పార్లమెంటుకు పంపవద్దని ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఒకప్పటి జగన్ వదిలిన బాణం... బల్లెంగా మారి వైసీపీకి ఓటమి తప్పదేమో అని సర్వత్రా చర్చ సాగుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనతో విసిగిపోయిన జనం ఇప్పటికే టీడీపీ వైపు చూస్తున్నారు. దీంతో ఈసారి కడప కోటలో గెలిచేదెవరనేది ఆసక్తిగా మారింది.



(కడప - ఆంధ్రజ్యోతి): కడప.. ఈ పేరు దేశంలోనే ప్రసిద్ధి. ఖనిజాలకు, కవులకు, కళలకు కడప పుట్టినిల్లు. అంతే కాదండోయ్ పాలిటిక్స్‌లో కడప ఖ్యాతి ఢిల్లీ దాకా పాకింది. అలాం టి గడ్డ మీద ఇప్పుడు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు కాక రేపుతున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో కడప గెలుపోటములపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. కడప పార్లమెంటు నుంచి టీడీపీ అభ్యర్థిగా చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి తొలిసారిగా బరిలో దిగుతున్నారు. ఇక వైఎస్ కుటుంబం నుంచి దివంగత సీఎం వైఎస్ఆర్ ముద్దుల తనయి, సీఎం జగన్ చెల్లెలు, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండగా, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాష్‌రెడ్డే మళ్లీ బరిలో దిగుతున్నారు. వివేకా హత్యతో వైఎస్ కుటుంబం రెండుగా చీలింది. వివేకాను చంపిన హంతకులను చట్టసభలకు మళ్లీ పంపకూడదనే ఉద్దేశ్యంతోనే కడప పార్లమెంటు నుంచి పోటీ చేస్తున్నా అని షర్మిల చెబుతున్నారు. బస్సు యాత్రలోనూ ఇదే విషయం నొక్కి చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కడప పార్ల మెంటు ఎన్నికలు సర్వత్రా ఆసక్తికరంగా మారాయి. గతాన్ని అవగతం చేసుకుంటే.. కడప పార్లమెంటు 1952లో ఏర్పడింది. ఆ సంవత్సరమే పార్లమెంటుకు ఎన్నికలు జరి గాయి. తొలి ఎన్నికల్లో సీపీఐకి చెందిన ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన బసిరెడ్డిపై 18,467 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తొలి పార్లమెంటుకు ఎన్నికయ్యారు.

కడప పార్లమెంటు సభ్యుల వివరాలు

సం//	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి
1952	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సీపీఐ	పి.బసిరెడ్డి, కాంగ్రెస్
1957	వీఆర్ రెడ్డి	కాంగ్రెస్	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి, సీపీఐ
1962	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సీపీఐ	వీఆర్‌రెడ్డి, కాంగ్రెస్
1967	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సీపీఐ	కె.రామసుబ్బయ్య, కాంగ్రెస్
1971	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సీపీఐ	వీఆర్ రెడ్డి, ఎన్‌సీవో
1977	కందుల ఓబులరెడ్డి	కాంగ్రెస్	రామిరెడ్డి, డీఎల్‌డీ
1980	కందుల ఓబుల్‌రెడ్డి	కాంగ్రెస్-ఐ	పీవీఈఎస్ మూర్తి, జనతా
1984	డీఎన్‌రెడ్డి	టీడీపీ	కందుల ఓబుల్‌రెడ్డి, కాంగ్రెస్
1989	వైఎస్ రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	ఎంవీ రమణారెడ్డి, టీడీపీ
1991	వైఎస్ రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	సి.రామచంద్రయ్య, టీడీపీ
1996	వైఎస్ రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	కందుల రాజమోహన్‌రెడ్డి, టీడీపీ
1998	వైఎస్ రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	కందుల రాజమోహన్‌రెడ్డి, టీడీపీ
1999	వైఎస్ వివేకానందరెడ్డి	కాంగ్రెస్	కందుల రాజమోహన్‌రెడ్డి, టీడీపీ
2004	వైఎస్ వివేకానందరెడ్డి	కాంగ్రెస్	ఎంవీ మైసూరారెడ్డి, టీడీపీ
2009	వైఎస్ జగన్మోహన్‌రెడ్డి	కాంగ్రెస్	పాలెం శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ
2011	వైఎస్ జగన్మోహన్‌రెడ్డి	వైసీపీ	డీఎల్ రవీంద్రారెడ్డి, కాంగ్రెస్
2014	వైఎస్ అవినాష్‌రెడ్డి	వైసీపీ	ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ
2019	వైఎస్ అవినాష్‌రెడ్డి	వైసీపీ	ఆదినారాయణరెడ్డి, టీడీపీ

నాలుగుసార్లు సీపీఐ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి

ప్రజాసంక్షేమం, పార్టీ కోసం ఆస్తులు త్యాగం చేసిన ఎద్దుల ఈశ్వ ర్‌రెడ్డి ఐదుసార్లు కడప ఎంపీగా చేస్తే నాలుగుసార్లు గెలుపొందారు. 1952, 1962, 1967, 1971లో గెలుపొందారు. 1957లో ఓటమి చెందారు.

1957 నుంచి కాంగ్రెస్‌దే ఆధిపత్యం

కడప పార్లమెంటుపై కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యం ప్రదర్శిస్తూ వచ్చింది. 1952 నుంచి 18సార్లు ఎన్నికలు జరగగా పది సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొం దారు. వీరిలో దివంగత వైఎస్ నాలుగుసార్లు గెలిచి రికార్డు సృష్టించారు. 1989, 1991, 1996,1998 ఎన్నికల్లో కడప ఎంపీగా రాజశేఖర్‌రెడ్డి గెలుపొందారు.

టీడీపీ ఒక్కసారి

కడప పార్లమెంటు ఏర్పడిన తరువాత టీడీపీ ఒక్కసారే గెలుపొందింది. 1984లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డీఎన్ రెడ్డి తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి కందుల ఓబుల్‌రెడ్డిపై విజయం సాధించారు.

కడప పార్లమెంటుపై వైఎస్ కుటుంబం పట్టు

కడప పార్లమెంటుపై దివంతత వైఎస్ఆర్ కుటుంబం తన ఆధిపత్యం చూపిస్తూ వచ్చింది. వైఎస్ఆర్ కడప ఎంపీగా 1989లో పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచి ఆ కుటుంబానికే చెందిన వారే విజయం సాధిస్తూ వస్తున్నారు. 1989, 1991,1996, 1998 ఎన్నికల్లో దివంగత వైఎస్ఆర్ ఎంపీగా గెలుపొందారు. 1999, 2004 ఎన్నికల్లో దివంగత వైఎస్ వివేకానందరెడ్డి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో సీఎం జగన్ కాంగ్రెస్ నుంచి గెలుపొందగా, ఉప ఎన్నికల్లో 2011లో సొంత పార్టీ పెట్టి పోటీ చేశారు. ఇక 2014-19 ఎన్నికల్లో జగన్ చిన్నాన్న కొడుకు ఎంపీ అవినాష్‌రెడ్డి గెలుపొందగా, ఈ సారి మళ్లీ పోటీ చేస్తున్నారు.

ఉప ఎన్నికల్లో...

దివంగత రాజశేఖర్‌రెడ్డి బతికినంత వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఆయన మరణా నంతరం జగన్ వైసీపీని స్థాపించారు. ఎంపీ పదవికి రాజీనామా చేసి వైసీపీ న ుంచి 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి పోటీ చేయగా, జగన్ ఐదులక్షల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. అంతకు ముందు రాజశేఖర్‌రెడ్డి 4,22,709 ఓట్లతో గెలుపొందారు.

వైఎస్ కుటుంబానికి ఈసారి ఓటమి తప్పదా...

కడప పార్లమెంటుపై వైఎస్ కుటుంబం ఆధిపత్యం చెలాయిస్తూ వస్తోంది. 1989 నుంచి 2019 వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో వైఎస్ కుటుంబ సభ్యులే గెలుస్తూ వచ్చారు. అయితే ఈ సారి గెలుపు ఆనవాయితీ మారేటట్లు ఉందంటున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి బరిలో దిగుతుండగా, వైసీపీ నుంచి ఎంపీ అవినాష్‌రెడ్డి పోటీలో ఉన్నారు. అక్కాతమ్ముళ్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసు కుంటూ వస్తున్నారు. ఇక టీడీపీ నుంచి భూపేష్‌రెడ్డి బరిలో ఉన్నారు. దీంతో ఈ ఎన్ని కలు రసవత్తరంగా మారాయి. ఈ ముక్కోణపు పోరులో వైఎస్ కుటుంబానికి తొలిసారి ఓటమి తప్పదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ప్చ్.. ఇప్పుడూ జే బ్రాండేనా..

- ఎన్నికల వేళ మందుబాబుల్లో నిరుత్సాహం

కడప, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పండుగ పూట పాత పెళ్లామేనా.. అన్నట్లు ఎన్నికల వేళ జే బ్రాండ్ మద్యం అమ్మతుండటం పట్ల మందుబాబులు పెదవి విరుస్తున్నారు. ఎన్నికలంటే చాలు మందుబాబు లకు భలే హుషారువస్తుంది. ఎప్పుడెప్పు డు ఎన్నికలు వస్తాయా.. తనివి తీరా మందు కొడదామా అని ఎదురు చూస్తుంటారు. సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కార్పొరేటర్, కౌన్సిల్ వరకు ఏ ఎన్నికలు అయిన సరే ఇపుడు మద్యం, డబ్బు కామన్ అయిపోయింది. ఇపుడు సార్వత్రిక ఎన్నికలు హోరా హోరీగా సాగుతుండడంతో వేసవిలో మందుబాబులు వెరీహ్యాపీగా ఉన్నారు. కావాల్సినంత మందు తాగవచ్చని అనుకున్నారు. అయితే నిన్నటి దాకా జగన్ అమ్మిన మద్యమే ఇపుడు కూడా ఇస్తుండడంతో ప్చ్..ఎన్నికల వేళ కూడా జె బ్రాండ్ అంటూ కొందరు మందుబాబులు నిట్టూరుస్తున్నారు. జగన్ సీఎం అయిన తర్వాత ప్రభుత్వమే మద్యం అమ్ముతోంది. గతంలో ఎన్నడూ వినని మద్యం ఇక్కడ దొరుకుతోంది. ఎప్పుడూ వినని రకరకాల మద్యం రావడం చూసి ప్రతిపక్షాలు దానికి జే బ్రాండ్ అని పేరుపెట్టారు. మందుబాబులు కూడా జే బ్రాండ్‌గానే పిలుచుకుంటున్నారు. ఎన్నికల వేళ పాతబ్రాండ్లతో పాటు వేసవిలో చల్లచల్ల బీర్లు వేద్దామని సంబరపడ్డారు. అయితే వైసీపీ నుంచి కొంతమందికి మాత్రమే పాతబ్రాండ్ల మద్యం ఇస్తుండగా మిగిలిన వారికి జే బ్రాండ్ ఇస్తుండడంతో ఇపుడు కూడా ఇదేనా అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. నిన్నటి వరకు జగన్ సభలు, ఇతర ప్రచార సభల్లో జే బ్రాండ్లే ఇచ్చారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఇప్పటి నుంచి అయిన పాత బ్రాండ్లు ఇస్తారో లేక జే బ్రాండ్లు ఇస్తారో చూడాలి. కడప కార్పొరేషన్, పులివెందుల, బద్వేల్, ఎర్రగుంట్ల, కమలాపురం, జమ్మలమడుగు, మైదుకూరు, పోరుమామిళ్ల, వేంపల్లె, ప్రొద్దుటూరుల్లో బార్లు ఉన్నాయి. అయితే అక్కడ వైసీపీ నేతలు మందుబాబుల పోరు పడలేక బారుల్లో పాతబ్రాండ్లు కొందరికి మాత్రమే కొనిస్తున్నట్లు చెబుతున్నారు.

జీతాలెప్పుడు జగనన్నా..!

- పండగల వేళ వేతనాలు లేక విలవిల
- ఎన్నికల బకాయిలు చెల్లింపులు లేక..
- ఆందోళనలో సెర్ఫ్ సిబ్బంది

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఏప్రిల్ 18: ఈ ప్రభుత్వం ఉన్నన్నాళ్లూ ప్రభుత్వ కార్యక్రమాల విజయానికి ఎంతగానో కృషి చేసిన సెర్ఫ్ సిబ్బందికి వైసీపీ ప్రభుత్వం చివరలో వేతనాలు కూడా ఇవ్వకుండా ఆందోళనకు గురి చేస్తోంది. ఏప్రిల్ నెలలో హిందువులు జరుపుకునే ఉగాది, ముస్లింలు నిర్వహించుకునే రంజాన్ పండుగలతో పాటు క్రైస్తవులు నిర్వహిం చుకునే ఈస్టర్ పండుగలు కూడా వచ్చాయి. ఈ పండుగల వేళ వేతనాలు లేక సెర్ఫ్ ఉద్యోగులు విలవిలలాడిపోయారు. పండుగల ఖర్చుల కోసం అప్పులు చేసి పడరాని తిప్పలు పడ్డారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని సిబ్బందికి కూడా వేతనాలందని పరిస్థితి. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో చిరుద్యోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే, గత సంవత్సరం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులను సెర్ఫ్ సిబ్బందికి విధులు కేటాయించారు. సొంత ఖర్చులతో విధులు నిర్వహిం చిన సిబ్బంది తమకు రావాలసిన పారితోషికం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా, ఇక ఎమ్మెల్యే ఎన్నికలకు సిద్ధం కావాలంటూ.. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక పక్క వేతనాలు రాకపోగా, మరో పక్క రావలసిన ఎన్నికల బకాయిలు చెల్లింపులు ఊసే లేకపోవడంతో ఆర్థికంగా తమ ఇబ్బందులు పట్టించుకునే వారే లేరంటూ సెర్ఫ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నామినేషన్లు షురూ..

- తొలిరోజు పార్లమెంటుకు రెండు
- అసెంబ్లీకి తొమ్మిది దాఖలు
- కడప టీడీపీ ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి నామినేషన్

కడప, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో కీలకఘట్టమైన నామినేషన్ల పర్వానికి తెరలేచింది. ఎన్నికల అధికారులు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి ఉదయం 11 నుంచి నామినేషన్లను స్వీకరించారు. పార్లమెంటుకు సంబంధించి నామినేషన్లు కడప కలెక్టరేట్ కార్యాలయంలో దాఖలు చేయగా అసెంబ్లీ అభ్యర్థులు ఆయా నియోజకవర్గంలోని ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో దాఖలు చేశారు. కడప పార్లమెంటుకు టీడీపీ అభ్యర్థిగా చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఉదయం 11:20గంటలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి ఇతర టీడీపీ నేతలు ఉన్నారు. అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ చాంద్‌బాష నామినేషన్ వేశారు. ఇక కడప అసెంబ్లీకి జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ నుంచి అవ్వారు మల్లికార్జున, అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ మహబూబ్ బాష, మధుభారతం వెంకటసుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి తరపున ఆయన సతీమణి చదిపిరాళ్ల అరుణ, స్వతంత్ర అభ్యర్థి అల్లె ప్రభావతిలు నామినేషన్ వేశారు. ప్రొద్దుటూరులో సమాజ్‌వాదీ పార్టీ నుంచి కడింటి పెద్దన్న నామినేషన్ దాఖలు చేశారు. మైదుకూరు అసెంబ్లీకి వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి నామినేషన్ వేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ మహబూబ్ బాష, అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి శ్రీయపురెడ్డి రాజారామిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

సజావుగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా ప్రారంభమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో గురువారం ఉదయం కడప పార్లమెంటరీ నియోకవర్గ స్థానానికి తన చాంబరులో ఎన్నికల పబ్లిక్ నోటీసులు విడుదల చేయగా, అన్ని నియోజక వర్గాల్లో అసెంబ్లీ స్థానాలకు ఆర్వోలు పబ్లిక్ నోటీసులు విడుదల చేశారు. దీంతో గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల పక్రియ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. కాగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాకు నియమించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు రమేష్ భారతి, కేఎస్ సత్యేంద్ర సింగ్ మెహరా, రాజేష్‌కుమార్ మీనాలు ఇంటి గ్రేటెడ్ సెంటర్‌తో పాటు కంట్రోల్ రూమ్‌లోని అన్ని విభాగాలను పరిశీలించి కంట్రోల్ రూమ్ సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా సి.భూపేష్‌రెడ్డి...

కడప పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థిగా చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఉదయం మొదటి నామినేషన్ పత్రాలను జిల్లాఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి విజయరామరాజుకు కలెక్టరేట్‌లోని ఆర్వో చాంబరులో సమర్పించారు. అనంతరం భూపేష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ యువతను రాజకీయాల్లో ప్రోత్సాహించే దిశగా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తనకు కడప పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. తొలిరాజు నామినేషన్‌ను దాఖలు చేశానని, 20వ తేదీ బీజేపీ, జనసేన కూటమి నేతలతో పాటు అన్ని నియోజక వర్గాల్లో ఎన్నికల బరిలో ఉండే కూటమి అభ్యర్థులతో కలసి 20వ తేదీ శనివారం తన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తానని తెలిపారు. ఈ ఎన్నికల్లో జిల్లా ప్రజలందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని, జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు.



నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

హంస వాహనంపై కోదండరాముడి విహారం



వేణుగోపాలంకారంలో..

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18: కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం రాత్రి హంస వాహనంపై సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం సంపూర్ణంగా కలుగుతుంది. హంస వాహనాల్లోని పరమార్థం ఇదే... హంసలో పాలను, నీళ్లను వేరు చేసే సామర్థ్యం ఉంది. భక్తులలో అహంభావం తొలగించి దాసోహం అనే భావం కలిగించడానికే పరమహంస రూపానికి ప్రతీక అయిన హంసవాహనాన్ని స్వామి వారు అధిరోహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేణుగానాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని పురవీధుల గుండా భక్తులకు స్వామి వారు అభయమిచ్చారు. ఉదయం భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. ముందుగా సీతారామల్మోణులకు ప్రత్యేకంగా అలంకరించి పసుపు గంధంతో అభిషేకం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామాలయంలో ఊంజల్ సేవను టీటీడీ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామి వారు ఉదయం వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం రాత్రికి సింహవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవోలు నటేష్‌బాబు, ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



హంస వాహనంపై ఊరేగుతున్న కోదండరామస్వామి

వైసీపీకి గండికోట ముంపు తప్పదా..

- పరిహారం పంపిణీ చేయకపోవడంపై వ్యతిరేకత
- పునరావాస కాలనీల్లో అరొకర వసతులు
- ఆదినారాయణరెడ్డి ఇచ్చిన రూ.12లక్షల హామీ కూటమికి కలిసొస్తుందా..

కొండాపురం, ఏప్రిల్ 18: వైసీపీకి రాబోయే ఎన్నికల్లో గండికోట నిర్వాసితుల నుంచి వ్యతి రేకత ఎదురయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత ఎన్నికల ముందు మేము అధికారంలోకి వస్తే రూ.10లక్షల పరిహారం ఇవ్వడంతో పాటు నిర్వాసితులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం అంటూ వైసీపీ నాయకులు ఊరూరా కరపత్రాలు పంచి ఊదరగొట్టారు. అధికారం చేబట్టిన తర్వాత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోవడం అటుంచి కఠినంగా వ్యవహరించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పరిహారం ఇవ్వకుండా, నిర్వా సితులు ఇళ్లు ఖాళీ చేయడానికి గడువు ఇవ్వకుండా, రాత్రికిరాత్రే ఊళ్లు ఖాళీ చేయించడంపై ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. ఆ తర్వాత జరిగిన పులివెందుల సభలో నిర్దాక్షిణ్యంగా ఊళ్లు ఖాళీ చేయంచడంపై 'ఈ బిడ్డను క్షమించండి' అని చిలుకపలుకులు పలికిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్, ఆ తర్వాత నిర్వాసితులను పట్టించుకోకపోవడంపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.454.6 కోట్లకు జీవో ఇచ్చినా..

జమ్మలమడుగు నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో గండికోట ముంపువాసుల ఓట్లు కీల కం కానున్నాయి. గండికోట ప్రాజెక్టు కింద మొత్తం 22 గ్రామాలు ముంపునకు గురికాగా.. అందులో కొండాపురం మండలంలో 21 గ్రామాలు చౌటిపల్లె, సీతాపురం, గండ్లూరు, ఓబన్న పేట, కె.బొమ్మేపల్లి, దొరువు, బుక్కపట్నం, గంగాపురం, రేపల్లె, ముచ్చుమర్రి, పక్కీర్‌పేట, దత్తాపురం, నేదరపేట, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి, పి.అనంతపురం, ఏటూరు, రేగడిపల్లె, కె.సుగుమంచిపల్లె గురయ్యాయి. ముద్దనూరు మండలంలో కొర్రపాడు ముంపునకు గురైంది. మొత్తం 22 ముంపు గ్రామాలలో మొత్తం 18,204 మంది నిర్వాసితులు ఉన్నారు. వీరంతా 18 ఏళ్ల పైబడిన వారే కాబట్టి దాదాపు వీరందరికి ఓటు హక్కు ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా ఇంత వరకు పూర్తిస్థాయిలో రూ.10లక్షల పరిహారం చెల్లించకపోవడంతో నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగున్నరేళ్లుగా పరిహారం ఇవ్వకుండా మిన్నకుండిన ప్రభుత్వం గత ఏడాది 6.7.2023న పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది.. అయితే ఈ జీవోకు సంబంధించి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేయలేదు. అయితే ఎన్నికలలోపు పరిహారం ఇస్తామని ఇప్పటికీ వైసీపీ నాయకులు నిర్వాసితులకు మాటలు చెబుతూ ఊరడిస్తుండటం గమనార్హం. ఇక గండికోట పునరావాస కాలనీల్లో నిర్వాసితులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం పట్ల నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేయపోవడంతో పాటు, నీటి సౌకర్యం కల్పించకపోవడంపై మండి పడుతున్నారు.



కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు పునరావాసకాలనీలో రోడ్లు వెయ్యని దృశ్యం

రూ.12లక్షల హామీ కూటమికి కలిసొస్తుందా..

రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గండికోట నిర్వాసితులకు రూ.12లక్షల పరిహా రం ఇప్పిస్తామని ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి దేవగుడి ఆది నారా యణరెడ్డి చెబుతున్నారు. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వం ఉత్తుత్తి జీవో ఇచ్చి నిర్వాసి తులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని ఆయన మండిపడుతున్నారు. టీడీపీ హయంలో గతంలో ఉన్న రూ.1,82,000 పరిహారాన్ని రూ.6,75,000 పెంచామని ఆయన గుర్తు చేస్తున్నా రు. రాబోయే ఎన్నికల్లో పరిహారం పెంపు హామీ ఎంత వరకు ఓట్లు రాలుస్తుందో చూడాల్సి ఉందే.




2019 ఎన్నికల్లో గండికోట ముంపువాసుల ఓట్లకు ప్రత్యేకంగా వైసీపీ వేయించిన కరపత్రం

నాలుగేళ్లయినా పరిహారం రాలేదు..

పరిహారం ఇవ్వకుండా 2020 డిసెంబర్‌లో తమను నిర్ధాక్షిణ్యంగా ఖాళీ చేయంచారు. ఇంత వరకు నాకు అందాల్సిన రూ.7లక్షల పరిహారం రాలేదు. కాళ్ల అరిగేలా తిరుగుతున్నా అధికా రులు పట్టించుకోలేదు.

- బుగ్గనగారి చంద్రశేఖర్‌రెడ్డి, నిర్వాసితుడు, తాళ్లప్రొద్దుటూరు



పార్టీలు మారినా...

రాజంపేట, ఏప్రిల్ 18: ఆ నాయకుడి గురించి ఇటు ఉమ్మడి కడప జిల్లాలోనూ, అటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనూ తెలియని వారుండరు. రాష్ట్రంలో తొలిసారి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన మొట్ట మొదటి నేత గంటా నరహరి. రెండేళ్ల కిందట ఆయనను రాజంపేట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ఏడాదిగా పార్లమెంటు పరిధిలో తిరిగారు. అనంతరం ఆయన రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ఇక్కడ అనేక కార్యక్రమాలు చేపట్టారు. అటు ఎంపీగా, ఇటు ఎమ్మెల్యేగా అయినా రాజంపేటలో ఇక పోటీ చేస్తారు అనుకున్న దశలో ఈయన దిశ మారిపోయింది. రాజంపేట టీడీపీ నుంచి ఏవో కారణాల వల్ల ఎంపీ, ఎమ్మెల్యే టికెట్టు రాకపోవడంతో ఒక్కసారిగా పార్టీని వీడి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన కండువా కప్పుకున్నారు. వెనువెంటనే తిరుపతి ఎమ్మెల్యే టికెట్టు జనసేన తరఫున కేటాయించినట్లు ప్రచారం జరిగిపోయింది. ఇంతలో రెండురోజుల్లోనే అక్కడ వేరే అభ్యర్థిని ప్రకటించడంతో రాత్రికి రాత్రే కండువా మార్చేసి రాజంపేట ఎంపీ స్థానానికి పోటీ చేయాలనుకున్న తన ప్రత్యర్థి వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. అక్కడైనా టికెట్టు దొరికిందా అంటే.. అక్కడా ఏమీ లేదు. చివరికి వైసీపీ అభ్యర్థుల నామినేషన్‌లో పాల్గొని అందరికీ నమస్కారాలు చేసుకోవడం అది చూసిన వారికి చూడముచ్చటగా మారింది.

మరపురాని సన్నివేశం



తన తండ్రి కోసం ఏనుగుపై ప్రచారం చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం (ఫైల్)

గజరాజుపై సుగవాసి

రాజంపేట, ఏప్రిల్ 18: ఈ చిత్రాన్ని ఒకసారి మనం పరిశీలిస్తే చాలా తమాషాగా ఉంటుంది... ప్రస్తుతం రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం చిన్ననాటి చిత్రం. ఈ చిత్రం 1983వ సంవత్సరం నాటిది. ఆనాడు తన తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు ఏనుగు గుర్తు లభించడంతో ఆనాడు ఏనుగును తెప్పించి అట్టహాసంగా ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. తన తండ్రి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో తన తండ్రికి కేటాయించిన ఏనుగు గుర్తు అందరూ గుర్తు పెట్టుకునేలా ర్యాలీకి తీసుకొచ్చిన ఏనుగుపై రెండవ అబ్బాయిగా పంచెకట్టుకొని అందరికీ నమస్కరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆనాడు తీసిన బ్లాక్ అండ్ వైట్ ఫొటో ఈనాటికీ పదిలంగా ఉంది. ప్రస్తుత ఎన్నికల సమయంలో సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా ఈ అరుదైన ఫొటో అందరికీ ఆసక్తిగా మారింది.

చెన్నకేశవస్వామి.. నీవే దిక్కయ్యా..!



గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం



● సెంటిమెంటు...!

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే సమయంలో రాజకీయ నాయకులు మంచి ముహూర్తం చేసుకుంటారు. అచ్చొచ్చిన ఊరు, ఆలయం, మండలం ఇలా ఏదో ఒకటి ఎంచుకుంటారు. రాజకీయ నాయకులకు అచ్చొచ్చిన ప్రాంతం తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూడా ఉంది. పెద్దతిప్పసముద్రం పంచాయతీ బూచిపల్లిలోని చెన్నకేశవస్వామి అనుగ్రహం కోసం పూజలు చేసి ప్రచారం మొదలు పెట్టడం ఇక్కడి నాయకులకు సెంటిమెంట్‌గా మారింది. ఇక్కడ పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభిస్తే ఎన్నికల్లో కలిసొస్తుందని ప్రధాన పార్టీల అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తొలుత ఇక్కడున్న చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. అలాగే వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కూడా ఇక్కడ ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థులు చెన్నకేశవస్వామిని దర్శించుకోవడం సెంటిమెంటుగా భావిస్తున్నారు.

\- ములకలచెరువు

పంతులు గారూ...ముహూర్తం చూడండి

● పురోహితులను సంప్రదిస్తున్న అభ్యర్థులు

● మంచి ముహూర్తం కోసం

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల సందడి మొదలైంది. ప్రస్తుతం పొలిటికల్ ముహూర్తాల సమయం నడుస్తోంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు పురోహితులు, పండితులు, జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. పేరు, రాశి బలాల మీద నామినేషన్ల తేదీలను ఖరారు చేసుకుంటున్నారు. తేదీకి తోడు సమయం కూడా అచ్చొచ్చేలా చూసుకుంటున్నారు. రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవడం ఒక ఎత్తయితే ఆ తరువాత విజయం సాధించడానికి దేవుడి ఆశీస్సులు అవసరమని భావిస్తున్నారు. దీంతో తమకు తెలిసిన పండితులు, పురోహితులను సంప్రదిస్తున్నారు. వారిచ్చిన తేదీ, సమయాన్ని బట్టి నామినేషన్లు దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

\- ములకలచెరువు

బీ..ఫారం... ఏ-ఫారం అంటే...

తెలుసుకుందాం ...

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది ఎన్నికల సమయంలో ఏ-ఫారం, బీ- ఫారం అనే పదాలు తరచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు గానీ, ప్రత్యేక ప్రతినిధి గానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అవసరమైన పత్రాలతో పాటు బీ-ఫారంను దాఖలు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రంతో పాటైనా లేదా పరిశీలన సమయంలో రిటర్నింగ్ అధికారికి బీ-ఫారం అందించాల్సి ఉంటుంది. ఇలా బీ-ఫారం సమర్పించిన అభ్యర్థికే ఎన్నికల కమిషన్ పార్టీల గుర్తులను కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తారు. పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫారం అందిస్తారు. ఆ అధికారాన్ని ఆయనకు అప్పగిస్తూ ఇచ్చేదే ఏ-ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. ఫారం తీసుకున్న వ్యక్తి దానిని ఎన్నికల అధికారికి సమర్పించి తానే బీ-ఫారం ఇచ్చినట్లు స్పష్టం చేయాల్సి ఉంటుంది.

\- ములకలచెరువు

అంతా వారి గుప్పిట్లోనే..!



- అభివృద్ధి సున్నా.. ఆధిపత్యం మిన్న
- వనరులను లేకుండా చేసిన వైసీపీ పాలకులు
- ఒకే సామాజిక వర్గం చేతిలో రాజంపేట
- అన్నమయ్య ప్రాజెక్టు తెగినా ఇంతవరకు ఒక ఇల్లు పూర్తి చేయలేని పెద్దలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజంపేట సర్వనాశనం

రాజంపేట, ఏప్రిల్ 18: ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట నియోజకవర్గం శాంతికి మారుపేరుగా నిలిచింది. అన్నమయ్య జన్మస్థలిగా, బ్రిటీషు కాలం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా, పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగా వెలసిల్లుతున్న ఈ ప్రాంతాన్ని వైసీపీ పాలకులు అధికారంలోకి వచ్చిన వెంటనే సర్వనాశనం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఇద్దరూ ప్రధాన వైసీపీ ప్రజాప్రతినిధులు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అవినీతిలో ఒకరికొకరు పోటీపడుతూ కోట్ల రూపాయల సొమ్మును మూటగట్టుకున్నారు. ఒకే సామాజికవర్గం చేతిలో రాజంపేట నియోజకవర్గం కొట్టుమిట్టాడుతోంది. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఒకరికొకరు పోటీ పడుతూ సొమ్మును వెనకేసుకున్నారే తప్ప అభివృద్ధి శూన్యమే. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తన చిన్నాన్న, తమ్ముడు, ఇతర కుటుంబ సభ్యుల పేర్లతో నందలూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని ప్రభుత్వ సొమ్ముతో వాటిని అభివృద్ధి పరిచి భూకబ్జాల ఎమ్మెల్యేగా వాసికెక్కాడు. తన హయాంలో భారీ ఎత్తున ఇసుక దోపిడీకి పాల్పడి కోట్ల రూపాయలు సంపాదించాడు. కేవలం తన సామాజిక వర్గానికే కొమ్ముకాస్తూ బలహీన వర్గాలను అణగదొక్కారు. తన తమ్ముడు మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ పదవిని, తనకు ఎమ్మెల్యే పదవిని, తన చిన్నాన్న మేడా విజయభాస్కర్‌రెడ్డికి మండలాధ్యక్ష పదవిని, తన తమ్ముడు రాజశేఖర్‌రెడ్డికి సర్పంచ్ పదవిని ఇచ్చి అన్ని పదవులను గుత్తాధిపత్యంగా ఉంచుకున్నాడు. తన మండల జడ్పీటీసీ పదవి, నియోజకవర్గంలో మున్సిపల్ చైర్మన్ పదవి, తన మండల జడ్పీటీసీ పదవిని సైతం సామాజికవర్గానికే కట్టబెట్టారు. ఎందుకూ పనికి రాని డైరెక్టరు, వైస్ చైర్మన్, మండల ఉపాధ్యక్ష పదవులను ఇతర సామాజిక వర్గాలకు ఇచ్చి సామాజిక న్యాయం చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదమైన అంశం. ఇక జడ్పీ చైర్మన్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కొండలను సైతం కబ్జా చేసి ప్రభుత్వ సొమ్ముతో కొండలపై సిమెంటు రోడ్లు వేసుకుని సామంతరాజులా గుర్రాలపై సవారీ చేస్తూ కొండలపై విలాసవంతమైన ఇంటిని కట్టుకుని బినామీ పేర్లతో వందల ఎకరాలు కబ్జా చేసి అభివృద్ధిని అటకెక్కించారు. ఈ విధంగా మేడా, ఆకేపాటి ఇరువురు నేతలు తమ సామాజికవర్గానికి, తమ కుటుంబీకులనే అందలం ఎక్కించి అన్ని వర్గాలను అణగదొక్కి సామాజిక న్యాయం పాటించినట్లు చెప్పుకోవడం అందరూ నవ్వుకునే అంశం.

అన్నమయ్య బాధితులకు ఒక్క ఇంటినైనా కట్టించారా..?

హృదయ విదారక ఘటన అన్నమయ్య ప్రాజెక్టు వ్యవహారం. ఈ ప్రాజెక్టును దిగువ ప్రాంతంలో ఇసుక దోపిడీని చేసుకోవడానికి ఒకరికొకరు పోటీలు పడి ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతాలకు నీరు రాకుండా వైసీపీ నేతలు అడ్డుకోవడం, ప్రాజెక్టు తెగిపోయి సుమారు 40 మంది మృతి చెందడం, 400 ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. సుమారు ఐదు గ్రామ పంచాయతీలు మునిగిపోయాయి. రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలోని చెయ్యేరు పరివాహక ప్రాంతాలు నీటిపాలయ్యాయి. ఈ సంఘటన జరిగి రెండేళ్ల నాలుగు నెలలు దాటుతున్నా ఇంతవరకూ బాధితులకు ఒక్క ఇంటి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయించలేదు. వారు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ ఆ గ్రామాలను వదిలి ఇతర గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారు. ప్రాజెక్టు పునఃనిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడంతో అన్నమయ్య ప్రాజెక్టు అధోగతి పాలైంది. ఈ ప్రాజెక్టును వెంటనే పునర్ నిర్మిస్తామన్న సీఎం హోదాలో జగన్, స్థానిక ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ హామీలు గాలిమూటలయ్యాయి.

అతీగతి లేని ఆల్విన్ ఫ్యాక్టరీ

నందలూరులో ఆల్విన్ ఫ్యాక్టరీ మూతపడి 15 ఏళ్లు కావస్తోంది. ఈ ఫ్యాక్టరీ స్థానంలో కొత్త పరిశ్రమను తెస్తామని ఇదే ప్రాంతంలో గతంలో మూసివేసిన లోకోషెడ్డు స్థానంలో ట్రాక్షన్ షెడ్డు ఏర్పాటు చేస్తామన్న వైసీపీ నేతల హామీలు పూర్తిగా కనుమరుగయ్యాయి.

ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం

ఒంటిమిట్టలో కోదండరామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాల నుంచి రూ.36 కోట్లతో శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా చెరువుకు నీరందించే పథకం మూలనపడ్డా దానిని ఇంతవరకు పునరుద్ధరించలేదు. ఎత్తిపోతల పథకం మోటార్లు చెడిపోయి సోమశిల వెనుక జలాలకు వేయాల్సిన పైపుల పునరుద్ధరణ జరగలేదు. ఫలితంగా అవి మూలనపడడంతో ఒంటిమిట్ట చెరువుకు నీరు రాక 36 కోట్ల నీటి పథకం ఎందుకూ కొరగాకుండా పోయింది. ఒంటిమిట్ట కోదండరామాలయ వంద కోట్ల మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులు ఇంకా 50 శాతం పూర్తి కాకున్నా వాటిపై చర్యలు తీసుకోలేదు. కల్యాణ మండపం అర్ధభాగమే పూర్తయింది. సిద్దవటం మండలానికి ఒక్క అభివృద్ధి పనీ చేయలేదు. నియోజకవర్గంలో వీరబల్లి, సుండుపల్లి మండలాలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ గ్రామాలకు కనీసం రోడ్లు, రక్షిత మంచి నీటి పథకాలను కూడా ఏర్పాటు చేయలేదు.


జిల్లా కేంద్రం హామీ సైతం అటకెక్కించిన నేతలు

రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని హామీ ఇచ్చి మోసగించారు. రాజంపేటలో జన్మించిన అన్నమయ్య నామాన్ని జిల్లా కేంద్రానికి పెట్టి రాజంపేటలో ఉన్న అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకను కూడా అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేశారు. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రం రాజంపేటలో ఇంత వరకు రింగురోడ్డు లేకపోగా ఇరుకిరుకు రోడ్లతో వాహనాలు పట్టణంలోకి వెళ్లలేక ప్రజలు ట్రాఫిక్‌తో అవస్థలు పడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణానికి ఆనుకుని చక్రాలమడుగును వెడల్పు చేసి సుందరీకరిస్తామన్న వారి హామీలు పూర్తిగా నీరుగారిపోయాయి. రైల్వే అండర్ బ్రిడ్జిని కేంద్ర నిధులతో పూర్తి చేసినా రాష్ట్ర ప్రభుత్వం అండర్ గ్రౌండ్ రోడ్డును సైతం నిర్మించలేని దీనావస్థలో వైసీపీ పాలకులు ఉండడం పట్టణ ప్రజలు చేసుకున్న దౌర్భాగ్య పరిస్థితి. వంద కోట్లతో రాజంపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్న వీరి హామీలు విని ప్రజలు ముక్కున వేలేసుకునే పరిస్థితికి వచ్చారు.

కొసమెరుపు

ఒక్క మాటలో చెప్పాలంటే రాజంపేట నియోజకవర్గంలోని ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ తమ సామాజికవర్గాన్నే రాజకీయంగా, రాజ్యాంగ పదవుల్లో ఆకాశానికెత్తి మిగిలిన వర్గాలను అణగదొక్కి తమ సామాజికవర్గ నేతలే నియోజకర్గంలోని ఆరు మండలాల్లో సహజసంపదలైన అడవులు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులను కబ్జా చేసి అన్ని పదవులను వారే అనుభవిస్తూ అభివృద్ధి చేశామని, సామాజికన్యాయం చేశామని చెప్పుకోవడమే ఓ వింతైన విషయం.





అనాథలా అన్నమయ్య ప్రాజెక్టు ఆనవాళ్లు

శిథిలమైన నందలూరు ఆల్విన్ కర్మాగారం



ఇంకా పూర్తి కాని అన్నమయ్య ప్రాజెక్టు ముంపుబాధితుల ఇళ్లు



ఓటర్లలో సగం మంది నారీమణులే

● సీట్లు మాత్రం నలుగురికే

కడప, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున జరిగే కార్యక్రమాల్లో మహిళలను రాజకీయపార్టీల నేతలు ఆకాశానికి ఎత్తేస్తుంటారు. నారీమణులు లేనిదే మనుగడ కష్టం అనేలా ఉపన్యాసాలు ఇస్తుంటారు. అయితే ఎన్నికలకు సంబంధించి టికెట్ల విషయంలో మాత్రం ఆ మేరకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మహిళలకు కేటాయించిన సీట్లను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. జిల్లాలో మొత్తం ఓట్లు గురువారం సాయంత్రం వరకు 16,21,760 మంది ఉన్నారు. పురుషులు 7,92,371 ఉండగా, స్త్రీల ఓట్లు 8,29,175 మంది ఉన్నారు. అంటే పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నారు. అయితే సీట్ల కేటాయింపులో మాత్రం టీడీపీ కడప నియోజకవర్గం నుంచి ఆర్.మాధవిని బరిలో దింపుతుండగా, వైసీపీ బద్వేలు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధకే తిరిగి టికెట్ ఇచ్చింది. ఇక కాంగ్రెస్ నుంచి కడప పార్లమెంట్‌కు ఎంపీగా వైఎస్ షర్మిల పోటీ చేస్తుండగా, బద్వేలు నుంచి విజయజ్యోతి పోటీచేయనున్నారు. ఇంకా కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించలేదు. ఇప్పటి దాకా చూస్తే ఓటర్లలో సగం మందికి పైగా ఉన్న మహిళలకు నాలుగు సీట్లే కేటాయించడం గమనార్హం.

వ్యూహం బెడిసికొట్టింది

రాజీనామాకు ఒప్పుకోని వలంటీర్లు

- చంద్రబాబు భరోసాతో తిరగబడుతున్న వైనం
- కక్కలేక..మింగలేక.. ఏమీ చేయలేక
- చూస్తుండిపోతున్న వైసీపీ నేతలు



మదనపల్లె, ఏప్రిల్ 18: ఇంతకాలం ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా చెప్పుకొస్తున్న వలంటీర్లను రాజీనామా చేసి ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనాలన్న వైసీపీ నేతల వ్యూహం బెడిసికొడుతోంది. ఇంతకాలం తమ సేవలు వినియోగించుకుని, ఇప్పుడు కాదంటారా? అంటూ వలంటీర్లు వైసీపీ నేతలపై మండిపడుతున్నారు. తమ సేవల వల్లనే అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీకి మంచి పేరు వచ్చిందని ప్రచారం చేసుకుని.. గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు, ఇప్పుడు అవసరం తీరాక బోడిమల్లన్న అంటారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కమిషన్ జోక్యంతో వారంతా ఎన్నికల విధుల్లోనే కాదు..పింఛన్ల పంపిణీకి దూరంగా ఉన్నారు. అలాగే ప్రచారంలో పాల్గొనకుండా అడ్డుకట్ట పడటంతో వైసీపీ ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నాయకులు వలంటీర్ల సేవలను వినియోగించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించారు. అవకాశం ఉన్న అన్ని దారులు మూసుకుపోవడంతో చివరకు రాజీనామా అస్త్రాలను తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంతమంది రాజీనామాలు చేసి ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. అంతలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వలంటీర్లకు వరాలు ప్రకటించారు. తాము అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, ఆ వ్యవస్థను ఎక్కడా తీసేయమని భరోసా ఇచ్చారు. అంతేకాదు..వారికి గౌరవవేతనం రూ.10 వేలు ఇస్తామని బంపర్ ఆఫర్ ప్రకటించారు. అంతే వలంటీర్లలో ఎక్కడ లేని ఉత్సాహం, ఉద్యోగ భద్రత ఏర్పడింది. దీంతో అప్పటి వరకూ వైసీపీకి వీరాభిమానులుగా ఉన్న వారు కూడా ఒక్కసారిగా మారిపోయారు. ఇంతకాలం రూ.5 వేలతో తమ వద్ద ఊడిగం చేయించుకున్న జగన్ ప్రభుత్వంపై.. చంద్రబాబు భరోసాతో తిరగబడుతున్నారు. దీనిని పసిగట్టిన స్థానిక వైసీపీ నాయకులు..వలంటీర్లపై వారం రోజులుగా ఒత్తిడి మొదలు పెట్టారు. వీరితో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసి.. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరిన్ని పథకాలు, మరింత లబ్ధి చేకూరుస్తామని తాయిళాలు వేస్తున్నారు. వీరి మాటలు, హామీలు లెక్క చేయని చాలామంది వలంటీర్లు టీడీపీ అధికారంలోకి వస్తే మాకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెగేసి చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీలలో అధికార పార్టీ కౌన్సిలర్లు, మండల, గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు రాజీనామా చేయాలని వలంటీర్లపై ఒత్తిడి చేస్తున్నారు. రాజీనామా చేయకుంటే పార్టీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొనాలని సూచిస్తున్నారు. ఈ రెండూ చేయకుంటే తామంతట తామే విధులు, ఉద్యోగం నుంచి మిమ్మల్ని తొలగిస్తామని బెదిరిస్తున్నారు. తమకు ఇప్పటికే 35 ఏళ్లు దాటిపోయాయని, ఇప్పటికిప్పుడు రాజీనామా చేస్తే..తర్వాత తమ పరిస్థితి ఏంటని వలంటీర్లు వైసీపీ నాయకులను ప్రశ్నిస్తున్నారు. వయస్సు దాటిన తమకు ఎవరు ఉద్యోగం, ఎక్కడిస్తారని వాదిస్తున్నారు. తమ ప్రభుత్వం రాగానే తిరిగి వలంటీరుగా తీసుకుంటామని చెబుతున్నా.. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని గ్యారెంటీ ఏముందంటున్నారు. తమ పనితీరు, చదువు, వయస్సును పరిగణలోకి తీసుకునే, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్కున చేర్చుకున్నారని, ఆ అవకాశాన్ని వదులుకోమని చెబుతున్నారు. మీరు చెబుతున్నట్లు.. ఇప్పటికిప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలను కాదని, ఎన్నికల విధులు, ప్రచారంలో పాల్గొనలేమని తెగేసి చెబుతున్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాన్వేషణలో ఉంటూ కేసులు ఎదుర్కోలేమని వాపోతున్నారు. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండని వాదిస్తూ, అటు రాజీనామాలు చేయకుండా, అటు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా దూరంగా ఉంటున్నారు. ఇదిలా వుండగా, కొందరు మాత్రం వివిధ కారణాలతో పార్టీకి వీరవిధేయతగా, స్థానిక నాయకులు బంధువులుగా, అనుచరులుగా ఉన్నవారు మాత్రం అక్కడక్కడా రాజీనామా చేస్తూ, ఎన్నికల విధులకు దగ్గరవుతున్నారు.

పసిడిపురిలో అమాత్యులేరీ..?



- 16 దఫాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలు
- మంత్రి పదవికి నోచుకోని నియోజకవర్గం
- పాతికేళ్ళపాటు సాగిన వరదరాజులరెడ్డి హవా
- మూడోసారి ముచ్చటగా బరిలో రాచమల్లు

వ్యాపారానికి, కవులకు, కళాకారులకు కొదవలేని పసిడిపురిని ఇంతవరకూ ఒక్క మంత్రి పదవీ వరించలేదు. ఇప్పటికి 16 పర్యాయాలు ఎన్నికలు జరిగితే ఒక్క పర్యాయం ఆర్యవైశ్యులకు, 15 పర్యాయాలు రెడ్ల సామాజిక వర్గీయులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఇంత ఘనత వహించిన ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్క పర్యాయం కూడా మంత్రి పదవి దక్కక పోవడం గమనార్హం. 1952లో ప్రొద్దుటూరు నియోజకవర్గం ఏర్పడింది. 62 ఏళ్ళుగా ఈ నియోజకవర్గం నుంచి 16 దఫాలుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గం నుంచి ఒక్కసారంటే ఒక్కసారి కూడా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం దక్కలేదు.



25 ఏళ్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన వరదరాజుల రెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 18: ప్రొద్దుటూరుకు 16 సార్లు ఎన్నికలు జరిగితే అందులో 1957లో ఒక్కసారి మాత్రం ఉప ఎన్నిక జరిగింది. ఇందులో కాంగ్రెస్ కాంగ్రెస్ (ఐ) తరపున తొమ్మిది సార్లు, టీడీపీ తరపున మూడుసార్లు, ఇండిపెండెంటు రెండు సార్లు, వైసీపీ అభ్యర్థులు రెండు సార్లు గెలిచారు. 1952 మొదటిసారి ప్రొద్దుటూరు నియోజకవర్గంకు జరిగిన ఎన్నికల్లో మొత్తం ఓట్లు 68,162 ఓట్లు వుండగా అందులో పోలైనవి 45,535 ఓట్లు. కందుల బాలనారాయణరెడ్డి కాంగ్రెస్ నుంచి 15,054 ఓట్లతో పాణ్యం ఎర్రమునిరెడ్డి (కేఎంపీపీ)పై గెలిచారు. ఆ తర్వాత రెండో సారి 1955లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 64,618 ఓట్లకు 42,648 ఓట్లు పోలవగా సీపీఐ అభ్యర్థి రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి (చంద్రన్న)పై కాంగ్రెస్ అభ్యర్థిగా కందుల బాలనారాయణరెడ్డి 23,563 ఓట్లతో గెలిచారు. చంద్ర ఓబులరెడ్డికి 19,085 ఓట్లు వచ్చాయి. 1957లో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. నాడు మొత్తం ఓట్లు 67,465 ఓట్లలో 46,281 పోలైతే చెల్లుబాటు అయినవి 46,121. ఇండిపెండెంట్‌గా రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి పాణ్యం ఎర్రమునిరెడ్డిపై 28,088 ఓట్లతో గెలిచారు. పాణ్యం ఎర్రమునిరెడ్డికి 16,419 ఓట్లు వచ్చాయి. 1962లో జరిగిన ఎన్నికల్లో పాణ్యం ఎర్రమునిరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చంద్ర ఓబుళరెడ్డిపై గెలిచారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్ రామసుబ్బారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థి పాణ్యం ఎర్రమునిరెడ్డిపై గెలిచారు. 1972లో ఆర్యవైశ్యకులానికి చెందిన కొప్పరపు సుబ్బారావు కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీఐ అభ్యర్థి ఐ సుబ్బారెడ్డిపై విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థిగా చంద్ర ఓబులరెడ్డి, జనతాపార్టీ అభ్యర్థి జి.పుల్లారెడ్డిపై గెలుపొందారు. ఇప్పటి వరకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సీపీఐ, జనతా పార్టీలు, ఇండిపెండెంట్‌గా పోటీచేస్తూ వచ్చినా 1982లో దివంగత ఎన్టీరామారావు తొలిసారి ప్రాంతీయ పార్టీ (తెలుగుదేశం)ను స్థాపించి 1983 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున డాక్టర్ ఎంవీ రమణారెడ్డి పోటీ చేసి ఇండిపెండెంట్ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిపై గెలుపొందారు. 1985 ఎన్నికల్లో ఎంవీ రమణారెడ్డి రాయలసీమ విమోచన సమితి పార్టీ నడుపుతూ స్వతంత్ర అభ్యర్థిగా నిలిచి టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి చేతిలో ఓడిపోయారు. తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా వరదరాజులరెడ్డి వరుసగా 1989, 1994, 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు డాక్టర్ జి.వి.క్రిష్టారెడ్డి, కొవ్వూరు రామసుబ్బారెడ్డి, మల్లెల లింగారెడ్డిపై విజయం సాధిస్తూ వచ్చారు. దాదాపు ఒకతరం పాటు పాతికేళ్ళు ఆయన హవా సాగింది.



ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్



కాంగ్రెస్ హవాలో జిల్లాలో ఏకైక టీడీపీ ఎమ్మెల్యే లింగారెడ్డి


2009లో టీడీపీ అభ్యర్థి మల్లెల లింగారెడ్డి చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి మొదటి సారి ఓటమి చెందారు. అప్పట్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా, కాంగ్రెస్ రాష్ట్రంలో రెండో సారి అధికారంలోకి వచ్చింది. జిల్లాలో ప్రొద్దుటూరు మినహా అన్ని స్థానాలు కైవశం చేసుకున్నా జిల్లాలో ఏకైక టీడీపీ ఎమ్మెల్యేగా లింగారెడ్డి విజయదుందుభి మోగించారు.

2014, 2019లో గెలుపొందిన వైసీపీ

వైసీపీ ఏర్పడినప్పటి నుంచీ ప్రొద్దుటూరులో రెండుసార్లు ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గెలుపొందారు. వైసీపీ 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పోటీ చేయగా టీడీపీ అభ్యర్థిగా నంద్యాల వరదరాజులరెడ్డి పోటీ చేసి శిష్యుడైన రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చేతిలో రెండోసారి ఓటమిచెందాడు. ఆతరువాత జరిగిన 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మల్లెల లింగారెడ్డి వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. మూడో సారి వైసీపీ హ్యాట్రిక్ కోసం ముమ్మరయత్నాలు చేస్తోంది. ఈ పర్యాయం టీడీపీ అభ్యర్థిగా నంద్యాల వరదరాజులరెడ్డి బరిలో నిలవగా శిష్యుడైన రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా బరిలో వున్నాడు. పదేళ్ళ రాచమల్లు పాలనలో పట్టణంలో ఎంతో వ్యతిరేకతను కూడకట్టుకున్న రాచమల్లు హాట్రిక్ యత్నాలు ఫలిస్తాయా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫలితంగా ఈ ఎన్నికలు ప్రొద్దుటూరులో ఉత్కంఠత రేకెత్తిస్తున్నాయి. ఒక వైపున వైసీపీ వైఫల్యాలు, మరో వైపున రాచమల్లుపై ప్రజావ్యతిరేకత టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపిస్తుందా లేదా మే 13న ప్రొద్దుటూరు ఓటర్లు నిర్ణయించనున్నారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ బీసీలకు దక్కని టిక్కెట్లు


ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటర్లు బీసీలున్నారు. ఆ తరువాత ఆర్యవైశ్య లు, ముస్లింలు. కేవలం 20 శాతం మాత్రమే రెడ్ల సామాజిక వర్గం. కానీ నియోజకవర్గం పుట్టినప్పటి నుంచీ వారిదే ఆధిపత్యం కొనసాగుతోంది. 2019 ఎన్నికల్లో ప్రొద్దుటూరు నుంచి బీసీలు టీడీపీ టిక్కెట్టు ఆశించారు. అందుకోసం పెద్ద ఎత్తున బీసీ సంఘాలు సభలు సమావేశాలు జరిపి గళం విప్పారు. బీసీల పార్టీఅయిన టీడీపీ సీటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చంద్రబాబును కలిశారు. కానీ మళ్లీ సామాజిక వర్గాల కూర్పులో రెడ్లకే సీటు దక్కింది. 2024లో వైసీపీ సామాజిక బస్సు యాత్ర జరిపి బీసీలకు ప్రాధన్యత ఇస్తానని చెప్పడంతో ప్రొద్దుటూరు నుంచీ బీసీలైన న్యాయవాది చెన్నా సరళాదేవి వైసీపీ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేసింది. ఆమేరకు పట్టణంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కరపత్రాలు పంపిణీ చేసి సమావేశాలు నిర్వహించారు. మరో వైపు బీసీలకు జనాభా దామాషా ప్రకారం టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు పెద్దఎత్తున సభలు జరిపారు. ప్రొద్దుటూరులో వైనాట్ బీసీ అని నినాదం తో డిమాండ్ వచ్చినా టీడీపీ వైసీపీ రెండు పార్టీలు కూడా మళ్ళీ రెడ్లకే ప్రాధన్యత నిచ్చాయి.



సం//	గెలుపొందిన అభ్యర్థి	పార్టీ	మొత్తం ఓట్లు	పొందిన ఓట్లు
1952	కె.బాల నారాయణరెడి	(కాంగ్రెస్)	68, 162	15,054
1955	కె.బాల నారాయణరెడ్డి	(కాంగ్రెస్)	64,618	23,563
1957	ఆర్ చంద్ర ఓబులరెడి	(ఇండి)	67,465	28,088
1962	పాణ్యం ఎర్రమునిరెడ్డి	(ఇండి)	77,924	30.695
1967	ఆర్ రామసుబ్బారెడ్డి	(కాంగ్రెస్)	72,924	27,354
1972	కొప్పరపు సుబ్బారావు	(కాంగ్రెస్)	93 289	30,502
1978	ఆర్ చంద్ర ఓబులరెడ్డి	(కాంగ్రెస్ ఐ)	1,10,010	34,160
1983	ఎంవీ రమణారెడ్డి	(టీడీపీ)	1,34,068	56,970
1985	ఎన్ వరదరాజులరెడ్డి	(టీడీపీ)	1,44,929	47,283
1989	ఎన్ వరదరాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,73 ,661	77,386
1994	ఎన్ వరదరాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,84,612	45,738
1999	ఎన్ వరదరాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,96,850	46,740
2004	ఎన్ వరద రాజులరెడ్డి	(కాంగ్రెస్)	1,96,263	54,429
2009	మల్లెల లింగారెడ్డి	(టీడీపీ)	2,04,221	73,023
2014	ఆర్ శివప్రసాద్‌రెడ్డి	(వైసీపీ)	2,32,284	93,866
2019	ఆర్‌శివ ప్రసాద్ రెడ్డి	(వైసీపీ)	2,36,730	1,07,941

కామ్రేడ్‌లదే తొలివిజయం

- ఇప్పటి వరకూ హ్యాట్రిక్ విజయం నమోదు కాని వైనం
- మహా ఉద్దండులకు సైతం మూడోసారి ఓటమి
- ఈ సారీ అదే పరిస్థితి ?
- ఇదీ కమలాపురం నియోజకవర్గం తీరు



కడప (ఎన్టీ ఆర్ సర్కిల్), ఏప్రిల్ 18: కమలాపురం నియోజకవర్గానికి జిల్లాలో విశిష్ట స్థానం ఉంది. సీఎం జగన్ మేనమామ వరుసగా రెండుసార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎందరో ఉద్దండులను కమలాపురం శాసనసభ స్థానానికి ఎంపిక చేసిన ఓటర్లు మొట్టమొదటి విజయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీకి అందించారు. 1952లో తొలిసారిగా కమలాపురం నియోజకవర్గానికి ఎన్నికలు జరిగితే.. అప్పట్లో సీపీఐ నుంచి పోటీ చేసిన నర్రెడ్డి శివరామిరెడ్డి గెలుపొందారు. ఈ నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యే ఆయనే. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి రామలింగారెడ్డిపై ఆయన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థులు 7సార్లు, టీడీపీ అభ్యర్థులు 3 సార్లు, స్వతంత్ర అభ్యర్థులు రెండుసార్లు, వైసీపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. అయితే.. 1952లో కమలాపురం నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన వారు ఎవరూ లేరు. 1985లో గెలుపొందిన మైసూరారెడ్డి 1989లోనూ విజయం సాధించారు. అయితే 1994లో ఓటమిపాలయ్యారు. వీరశివారెడ్డి కూడా ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలుపొందగా 1999లో ఓడిపోవడం వల్ల హ్యాట్రిక్ సాధించలేకపోయారు. ఇదే ఆనవాయితీ ఈ సారి కూడా కొనసాగుతుందని నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. ఇప్పటికే పి.రవీంద్రరెడ్డి రెండుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ దఫా ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ప్రజలు టీడీపీ వైపు మొగ్గుచూపనుండడం, పుత్తా నరసింహారెడ్డిపై సానుభూతి ఉండడంతో రవీంద్రనాథరెడ్డి హ్యాట్రిక్ విజయానికి చెక్ పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

చోటా మోటా నేతల ఆనంద హేళ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల్లోని చోటా మోటా నేతలు, వీధి నాయకులకు ఎక్కువగా గిరాకీ ఏర్పడింది. పార్టీలు మారేటప్పుడు జనాలకు జెండాలు మోస్తే రూ.500, తోడు వస్తే రూ.200, కార్యక్రమాలకు హాజరైతే మరో 200, మద్యం అందిస్తూ జోరుగా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు తంటాలు పడుతుంటారు. ఈ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనేటప్పుడు, పార్టీలు మారేటప్పుడు జన సమీకరణ కావాల్సి ఉండడంతో ముందుగానే నేతల వద్ద నుంచి డబ్బు పొందిన వారు కొందరు. అంతేకాక రాజకీయ పార్టీల నాయకులు ఆధిపత్యం ప్రదర్శించడం కోసం ఆయా ప్రాంతాల్లోని చోటా మోటా నేతలను దగ్గరకు తీసుకుంటూ తమ వర్గంలో చేర్చుకుంటూ తమ ఆధిపత్యం ప్రదర్శించాలని ఉవ్విళ్లూరుతూ అధినేతల వద్ద తమకు గుర్తింపు రావాలనే తలంపుతో ఖర్చుకు వెనుకాడడంలేదు. అనుకున్న తడవుగానే ప్రదర్శనలు చేయడం పరిపాటైంది. గ్రామాలకు వెళితే రూ.500, పట్టణాల్లో రూ.200, సాయంత్రం వరకు ఉంటే మరో రూ.200 మద్యానికి ఇవ్వడం వారి బల హీనతలను తమ బలప్రదర్శనకు వాడుకోవడం పరిపాటైంది. ఎవరైనా మందు పంచుతున్నారనే విషయం తెలుసుకుని ఆ ప్రదేశానికి వెళితే తమ వెంట వచ్చిన వారికే మందు ఇస్తామని, ఎవరంటే వారికి ఇవ్వమని చెప్పిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ ఎన్నికలు జరిగేంత వరకు పార్టీ కార్యక్రమాలు, బలప్రదర్శనలకు జనాలను చూపించేందుకు, ఆధిపత్యం ప్రదర్శించేందుకు ఈ రాజకీయ నేతలు విపరీతంగా ఖర్చు పెట్టేందుకు వెనుకాడడంలేదు. వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలి, ఊరికే రాజకీయ పార్టీల నాయకుల వద్దకు ఎందుకు వెళ్లాలి, వచ్చిన కాడికి డబ్బు, ఇచ్చిన కాడికి మందు చాలు అన్న రీతిలో నాయకుల వెంట వెళుతూ కాలం వెల్లబుచ్చుతున్నారు మరికొందరు. ఈ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఎంత బలప్రదర్శన జరిగితే అంత ఉపయోగం అన్న రీతిలో ఉన్నారు మరికొందరు. ఎన్నికలు పూర్తయితే కనీసం మంచినీరు కూడా ఇవ్వరనే విషయం కూడా వారికి తెలియకపోలేదు. కానీ వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని తమ ప్రాంతాల వారు పిలిచినప్పుడు ఎప్పుడు ఏ వ్యక్తితో ఏ అవసరం వస్తుందోనని భావించి వారి బాటలోనే పయనిస్తున్నారు మరికొందరు. ఈ వేడుకలు ఎన్నికలు జరిగే వరకు వీరి విన్యాసాలు, బలప్రదర్శనలు, ప్రగల్భాలు చూడాల్సిందే, వినాల్సిందే. ఎన్నికల సమయంలో యువతను ఎక్కువగా తమ వైపు తిప్పుకొనేందుకు కొందరు మద్యం, మనీ, మటన్, చికెన్ బిర్యానీలు, విందు వినోదాలు ఇచ్చిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి.

వృద్ధుల కోసం...

ఇంటి వద్దనే ఓటు హక్కు

85 ఏళ్లు దాటిన ఓటర్లు 7360 మంది

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 18: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ నాటికి 16 34644 మంది ఓటర్లున్నారు. అందులో అత్యధిక వయసు గల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా మార్గ దర్శకాలు జారీ చేసింది. జిల్లాలో 85 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు7360 మందిని బీఎల్వోలు గుర్తించారు. వారిలోఓ పురుషులు 2640, మహిళలు 4720 మంది ఉన్నారు. వారంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా బీఎల్వోలు ఇప్పటికే పారం-12-డి పూర్తిచేసి నివేదికలను సెక్టోరల్ అధికారులకు అంద జేశారు. ఎవరైనా వృద్ధులు తమ ఓటును పోలింగ్ కేంద్రానికి వెళ్ల లేని వారు వెంటనే బూత్ లెవల్ అధికారులను సంప్రదించాలి. ఈ అవకాశం కేవలం నాలుగు రోజులు మాత్రమే.

ప్రత్యేక చర్యలు అంటే ఇవేనా...?



ఆర్డీఓ కార్యాలయం వద్ద డీఎస్పీ యశ్వంత్ సహ కేంద్ర బలగాలు బందోబస్తు

జమ్మలమడుగు, ఏప్రిల్ 18: జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం నుంచి డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద కేంద్ర బలగాలతో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల నామినేషన్ల పక్రియ ప్రారంభం కావడంతో డీఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. నామినేషన్లకు వచ్చే అభ్యర్థులను తనిఖీ చేసి అభ్యర్థి సహా ఐదుగురికి అనుమతి ఇచ్చారు. ఇవన్నీ అటుంచితే జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా కూల్ డ్రింక్ షాపులు, దుకాణాలు ఉండడం వలన జనాలు గుంపులుగా చేరారు. మధ్యాహ్నం పాఠశాల విద్యార్థులు, వాహనాలు కూల్‌డ్రింక్ షాపుల వద్ద 30 నుంచి 40 మంది నిలబడి ఉండడం, పోలీసు అధికారులున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వంద మీటర్లకు దూరంలో వాహనాలను నిలపాలన్నది నిబంధన. ఐతే ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా జనాల రద్దీ ఉన్నా పోలీసు అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు వేసే ప్రాంతంలో ఒకే చోట ముగ్గురు నుంచి ఐదుగురు నిలబడకూడదనే నిబంధనలున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శలున్నాయి. విలేకరులకు కార్యాలయం ఆవరణలో సౌకర్యం కల్పించాల్సిన అధికారులు స్పందించలేదు. అంతేకాకుండా రోడ్డుపై ఉండకూడదని చెప్పడంతో ఎదురుగా ఆటోల్లో విలేకరులు కూర్చొని ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా లేదా ఆవరణలో వసతి కల్పించాలని కోరారు.



నామినేషన్ కార్యాలయం వద్ద గుంపులుగా జనాలు, పోలీసుల వాహనాలు

వైసీపీకి డాక్టర్ సునీత భయం

సోదరి షర్మిల గెలుపు కోసం అహర్నిశలు కృషి ● తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని తలపిస్తున్న వైనం

(కడప - ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి.. ఇప్పుడు ఈ పేరు వింటేనే వైసీపీ శిబిరం జడుసుకుంటోంది. ప్రత్యక్ష రాజకీయాలు అలవాటు లేని సునీత ఇప్పుడు కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేస్తున్న సోదరి వైఎస్ షర్మిల గెలుపుకోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడం వైసీపీని కలవరపాటుకు గురిచేస్తోంది. సునీత ఇటీవల వేస్తున్న పొలిటికల్ అడుగులు చూస్తే తన తండ్రి దివంగత వివేకానందరెడ్డి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని నిశ్శబ్దంగా తన పని తాను చేసుకు వెళుతున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

షర్మిలాను ఎంపీ చేయడమే లక్ష్యం

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని 2019 మార్చి 15న ఆయన ఇంట్లో గొడ్డలితో నరికి దారుణంగా చంపారు. అప్పట్లో ఈ హత్యను వైసీపీ నేతలు టీడీపీ పైకి నెట్టి ఎన్నికల్లో బాగా లబ్ధిపొందారు. అయితే సీబీఐ విచారణతో వివేకా హత్య నిందితులెవరో తేటతెల్లమైంది. ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని సీబీఐ నిందితులుగా చేర్చింది. దీంతో ఒక్కసారి జగన్ కుటుంబం చీలిపోయింది. వివేకా హంతకులకు శిక్ష పడాలని సునీత చేస్తున్న పోరాటానికి షర్మిల మద్దతు ఇచ్చారు. వివేకా చివరి కోరిక తనను ఎంపీ చేయాలన్నదే అని షర్మిల ప్రకటించారు. అది నెరవేర్చడం, వివేకా హత్య కేసులో నిందితుడు పార్లమెంటుకు వెళ్లకుండా ఉండేందుకు పోటీ చేస్తున్నట్లు షర్మిల, సునీత ప్రకటించారు. ఇప్పటికే షర్మిల బస్సు యాత్ర జిల్లాలో సక్సెస్ అయింది. బస్సు యాత్రలో డాక్టర్ సునీత సైతం పాల్గొన్నారు. వివేకా హత్య కేసులో నిందితులకు ఓటు వేయవద్దంటూ బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. వివేకా సన్నిహితులను 15 రోజులుగా సునీత కలుస్తూ వస్తున్నారు. పులివెందుల, వేంపల్లె, కడప.. ఇలా వివేకా అనుచరులుగా ఉన్న వారందరినీ కలిసి వివేకా చివరి కోరిక మేరకు షర్మిలాను ఎంపీగా గెలిపించాలని కోరుతూ.. వ్యూహాత్మకంగా అందరి మద్దతు కూడగడుతూ వస్తున్నారు. అలాగే పులివెందులలో తిరుగుతూ వివేకాను చంపిన హంతకులకు ఓటు వేయవద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. గురువారం షర్మిలా గెలుపు కోసం ప్రచారానికి సునీత శ్రీకారం చుట్టారు. పులివెందుల పూలంగళ్ల వద్ద వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం చేపట్టారు. చాపకింద నీరులా సునీత తన తండ్రి వివేకాను తలపించేలా ముందుకు వెళుతుండటం వైసీపీ నేతలను కలవరపాటుకు గురిచేస్తోంది.



పులివెందుల పూలంగళ్ల వద్ద వినాయకుని గుడిలో ప్రచారానికి ముందు ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ సునీత

ఆధారాలున్నాయా...

జాగ్రత్త పడకుంటే నగదు సీజ్

అత్యవసరమైతే ఆన్‌లైన్‌లో నగదు బదిలీ బెటర్

పులివెందుల రూరల్, ఏప్రిల్ 18: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) బృందాలు, పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అంతేకాకుండా ప్రజల వద్ద ఉన్న బ్యాగులు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీల్లో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులకు సంబంధించి ఆధారాలు చూపకపోతే సీజ్ చేస్తున్నారు. బిల్లులు, రసీదులు ఇలా ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటారు. ఈ ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రజలు జాగ్రత్తలు పడాల్సిందే. అత్యవసరమైతే ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేసుకోవడం మేలు.

- చదువుల కోసం ఫీజులు చెల్లించాల్సిన సమయంలో నగదు తీసుకెళ్లే సమయంలో పాఠశాల, కళాశాల ఫీజు కట్టాలనే నోటీసు వెంట ఉంచుకోవాలి. లేదా సంబంధిత యాజమాన్యాల రసీదులు ఉంచుకోవాలి.
- బ్యాంకు లావాదేవీలు రూ.50వేలకు మించితే ఆధారాలు చూపించాలి. చెక్కు ద్వారా నగదు విత్‌డ్రా చేస్తే చెక్కు జిరాక్స్, పాస్‌బుక్ దగ్గర ఉంచుకోవాలి. ఏటీఎం ద్వారా నగదు విత్‌డ్రా చేస్తే ఏటీఎం స్లిప్‌లు ఉంచుకోవాలి. ఒకవేళ నగదును డిపాజిట్ చేసేందుకు వెళ్తుంటే అందుకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- ఫైనాన్స్ సంస్థలు, చిట్టీలు రోజు భారీగా లావాదేవీలు జరుగుతాయి. కలెక్షన్ల ఏజెంట్ల వద్ద లక్షల్లో నగదు ఉంటుంది. వీరు ఆరోజు చేసిన కలెక్షన్ వివరాలు, బాకీ ఉన్న నగదు, వసూలైన నగదు ఇలా అన్ని వివరాలతో పాటు కస్టమర్ల సంతకంతో కూడిన రసీదులు ఉండాలి.
- బంగారు, ఇతర వస్తువులు కొనుగోలుకు నగదు తీసుకెళ్లే ప్రజలు శుభకార్యాలకు సంబంధించి శుభలేఖలు దగ్గర ఉంచుకోవాలి. తనిఖీ బృందం అడిగితే వివరాలు అందించాలి.
- అత్యవసర సమయాల్లో ఎక్కువ డబ్బు ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో పేషంట్ మెడికల్ కేస్ షీట్, మెడికల్ సర్టిఫికెట్, ఆస్పత్రి బిల్లులు అందుబాటులో ఉంచుకోవాలి.



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

పులివెందులలోనూ బలవంతమే..!

- రెండు రోజులుగా వలంటీర్లతో రాజీనామాలు

కడప, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోనూ వార్డు వలంటీర్ల బలవంతపు రాజీనామాలు సాగుతున్నాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు సాగించడం చర్చనీయాంశమైంది. అనేక జిల్లాల్లో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం అది ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లి కేసులు నమోదు చేయడం జరుగుతోంది. దీంతో వలంటీర్లను రాజీనామా చేయాలని ఆయా ప్రాంత వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో కూడా ఇదే పరంపర కొనసాగడం హాస్యాస్పదంగా ఉంది. రెండు రోజులుగా వలంటీర్లను రాజీనామా చేయాలని పులివెందుల నేతలు ఒత్తిడి తెస్తున్నారు. బుధవారం సుమారు 130 మంది వలంటీర్లతో రాజీనామా చేయించారు. అలాగే గురువారం కూడా 70 నుంచి 90 మందితో రాజీనామా చేయించినట్లు తెలిసింది. రాజీనామా చేస్తున్న వారికి రూ.5వేల నుంచి రూ.10వేలు నగదు అందించినట్లు తెలిసింది. ఐదేళ్లుగా వాడుకుని ఉన్నట్లుండి రాజీనామాలు చేయమనడం బాగోలేదని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని పులివెందులకు చెందిన ఓ అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రాజీనామాలు చేయడం వాస్తవమే అన్నారు. కొందరు నేతలు ఒత్తిడి తేవడంతో రాజీనామాలు చేశారని అన్నారు.

మైనార్టీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

- అధికారంలోకి వచ్చిన వెంటనే సుందరంగా హజ్‌హౌస్
- ముస్లిం పేదలకు తోడ్పాటు
- ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించండి.. మీ రుణం తీర్చుకుంటా
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, చిత్రంలో శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 18 : మైనార్టీలకు తెలుగు దేశం పార్టీ ఎప్పుడూ ఉంటుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే హజ్‌హౌస్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరం ఐఎంఏ హాలులో అధిక సంఖ్యలో ముస్లింలు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నగరంలో నిరుపయోగంగా ఉన్న హజ్‌హౌస్‌ను పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. నూతన షాదీఖానాతో పాటు పార్కులు కూడా నిర్మిస్తామన్నారు. ఆరు నెలల్లోనే కడప నగరంలో షహమీరియా బ్రిడ్జి, లాకాలేజీ బ్రిడ్జి నిర్మించి ప్రయాణాలకు మార్గం సుగమం చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైనచోటు గుర్తించి కొత్తరోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణానికి చర్యలు చేపడతాయన్నారు. అలాగే ముస్లిం మత పెద్దలు, ఇమాంలు, మౌజన్లకు మసీదు కమిటి సభ్యులకు సొంత ఖర్చులతో 10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి పేద, మధ్యతరగతి ముస్లిం సోదరీమణులు వారి కాళ్ల మీద వారు నిలబడే విధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తామని స్కిల్ ట్రైనింగ్ ఇచ్చి చిన్న పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. పేదరికంతో విద్యకు దూరమవుతున్న ముస్లిం పిల్లల కుటుంబాలకు తోడ్పడతామన్నారు. ఆర్థిక సమస్యలతో చదువుకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి సొంత ఖర్చుతో విద్యావకాశాలు కల్పిస్తామన్నారు. మసీదుల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు సమన్వయంతో స్థానికంగా అవసరమైన కొత్త నిర్మాణాలు, సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కబ్జాకు గురవుతున్న వక్ఫ్‌బోర్డు భూములు, ఆస్తులను పరిరక్షిస్తామని తెలిపారు. నకాశ్ ముస్లిం శ్మశాన వాటికలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. రవీంద్రనగర్ లా కాలేజీ రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వాసితులకు శాశ్వత నివాసం కల్పించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అలాగే ఉన్నత విద్య చదివేవారికి ఫీజు రీయింబర్స్‌మెంటు కల్పిస్తామని తెలిపారు. స్వయం ఉపాధి కోసం వడ్డీ లేని రుణాలు రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తామన్నారు. వడ్డీ లేని ఇస్లామిక్ బ్యాంకింగ్ విధానాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. పేద ముస్లిం మహిళల వివాహానికి రూ.50వేలు విలువ చేసే కుటుంబ అవసర సామగ్రి అందిస్తామన్నారు. ముస్లిం బాలికలు మహిళలకు కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, మసీదుల నిర్మాణాలకు మరమ్మతుల కోసం రూ.ఐదులక్షల వరకు వక్ఫ్‌బోర్డు ద్వారా ఆదాయం కల్పిస్తామన్నారు. ఆదాయం లేని మసీదుల్లో ఇమాం, మౌజన్లకు నెలకు రూ.5వేలు, రూ.3వేలు గౌరవ వేతనం అందిస్తామన్నారు.

క్రిస్టియన్లకు టీడీపీ తోడ్పాటు అలాగే క్రిస్టియన్ మైనార్టీలకు కూడా టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేరుస్తామన్నారు. చర్చిల భూములకు ఆస్తులకు రక్షణ కల్పిస్తామని, అలాగే నూతన రాజధానిలో క్రిస్టియన్ భవన్ నిర్మాణం చేస్తామన్నారు. శ్మశాన వాటికలకు ప్రహరీలు, నీటి సౌకర్యం కల్పిస్తామని, శ్మశానాలు లేని ప్రాంతాల్లో స్థలం కేటాయిస్తామని చెప్పారు. బెత్లెహాంలు దర్శించే క్రిస్టియన్ ప్రయాణ చార్జీల్లో రాయితీ పెంచుతామన్నారు. క్రైస్తవులు నిర్వహించే వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందిస్తామని తెలిపారు. పేద విద్యార్థులు వృద్ధులు, అనాథ క్రైస్తవుల సహాయం కోసం టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. పేద క్రైస్తవుల మహిళల వివాహానికి అవసరమైన సామగ్రి అందిస్తామన్నారు. టీడీపీ హయాంలో పేద, ముస్లిం పిల్లల పెళ్లిళ్ల కోసం షాదీతోఫా పేరుతో రూ.లక్ష రూపాయలు, ముస్లిం యువత ఉపాధి కోసం రూ.3లక్షలు ఇవ్వడమే కాకుండా అందులో లక్ష సబ్సిడీ ఇచ్చారన్నారు.



మాధవీరెడ్డికి హారతులు పడుతున్న స్థానిక మహిళలు



ఓటర్లకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి

- తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరం 50వ డివిజన్ దండుకాలనీలో అధిక సంఖ్యలో స్థానికులు టీడీపీలో చేరారు. వారికి శ్రీనివాసులరెడ్డి పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. జగన్‌రెడ్డి దళితులను అవమానించిన వారికే అందలం ఎక్కించడం దుర్మార్గమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతి సభలో సీఎం జగన్ నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ఎనలేని ప్రేమ వలకబోస్తున్నారని విమర్శించారు. నాడు దళితుడిని చంపిన అనంతబాబును పార్టీనుంచి సస్పెండ్ చేసినట్లే చేసి మళ్లీ పార్టీలోకి పెట్టుకున్నాడన్నారు. జగన్‌రెడ్డి నడుపుతున్న ప్రభుత్వంలోనే దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు.డాక్టర్ సుధాకర్ నుంచి దళిత డ్రైవరు సుబ్రమణ్యం వరకు ఎంతో మంది దళిత బిడ్డలు బలయ్యారన్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ జిల్లా కంచికచెర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు తాండ్రు శ్యామ్‌కుమార్‌ను కొందరు శాడిస్టులు నిర్బంధించి నాలుగు గంటలు చిత్రహింసలుపెట్టారని, దాహం వేసి మంచినీరు అడిగితే సభ్య సమాజం తలదించుకునేలా మూత్రం పోసి అవమానించారన్నారు. బాధిత దళితులకు న్యాయం చేసేందుకు ఏర్పాటైన సంస్థకు అధిపతి అయిన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌బాబు ఈ ప్రభుత్వంలో నేనే బాధితుడిని అని వాపోయిన విషయం గుర్తు చేశారు. జగన్ జమానాలో దళితులపై అణచివేత దుశ్చర్యలకు ఇంతకు మించి పరాకాష్ట మరొకటి ఉండదన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 6035 మంది దళితులపై దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం దళితులపై దాడులు జరుగుతున్న రాష్ట్రంలో ఏపీ ఏడో స్థానంలో ఉందన్నారు. అస్పృశ్యత పేరుతో నంద్యాల జిల్లా మునగాల గ్రామంలోని కుంకులమ్మ ఆలయంలోకి వెళ్లకుండా అవమానించి అడ్డుకున్నారని మల్లెపోగు నరహరి అనే దళిత యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వుకానిస్టేబుల్ జంబులయ్య మరికొందరు నరహరిని కాలితో తన్ని ఆలయంలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించినట్లు తెలిపారు. ప్రభుత్వం తప్పులను ప్రశ్నిస్తే వారిపై అన్యాయంగా దాడి చేస్తున్నారన్నారు. శిరోముండనాలు, హత్యలు, వేధింపులు దమనకాండలకు పాల్పడుతున్నారని అన్నారు. కరోనా సమయంలో కేవలం ఒక్క మాస్క్ అడిగినందుకు వైజాగ్‌లో డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపారన్నారు. మద్యం రేట్లు పెంపుపై ప్రశ్నించినందుకు చిత్తూరు జిల్లాలో దళిత యువకుడు ఓంప్రకాశ్‌ను చంపారాన్నరు. అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నించినందుకు తూర్పుగోదావరిలో వర ప్రసాద్ అనే యువకుడికి గుండు కొట్టించారన్నారను. మాస్కు పెట్టుకోలేదని ప్రకాశం జిల్లా థామస్‌పేటకు చెందిన కిరణ్‌ను పోలీసులు కొట్టి చంపారన్నారు. చిత్తూరు జిల్లాలో మెజిస్ట్రేట్ రామక్రిష్ణ అతని సోదరుడు రామచంద్రపై దాడి చేశారని తెలిపారు. దళిత మహిళా డాక్టరు అనితారాణి బాత్‌రూములో ఉండగా వీడియోలు తీసి బెదిరించారన్నారు. కుచ్చులూరు బోటు ప్రమాదంపై ప్రశ్నించినందుకు మాజీ ఎంపీ హర్షకుమార్‌పై అక్రమ కేసులు బనాయించారన్నారు. దళితుల అసైన్డ్ భూములు అక్రమణపై ప్రశ్నించిన మహాసేన రాజేష్‌పై అక్రమ కేసులు పెట్టారన్నారు. విశాఖపట్టణం జిల్లా పెందుర్తి మండలం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు సూరిబాబు అనుచరుడు దళిత యువకుడిని అర్ధనగ్నంగా చేసి చెట్టుకు కట్టేసి చెప్పు తో కొట్టాడన్నారు. నెల్లూరు జిల్లా దగదర్తి మండలం ఉలవపాడు గ్రామంలో పెట్రోలు బంకు వద్ద దళిత కార్మికుడిని వైసీపీ నేత మహేశ్‌నాయుడు చెప్పుతో కొట్టి దుర్భాషలాడారని గుర్తు చేశారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దళితుల కోసం ఒక్క ఎకరా కూడా పంపిణీ చేయలేదన్నారు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంపై వైసీపీ ప్రభుత్వం కఠిన నిబంధనలను అమలు చేస్తుందని, దీంతో ఆరుగురు విద్యార్థులు మాత్రమే అర్హత పొందారని అదే టీడీపీ హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి 19 మంది విద్యార్థులకు విదేశీ విద్యను అందించామన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా నాయకులు బొమ్మిశెట్టి చంద్ర, రవికుమార్, ఎద్దుల రవి, సుబ్బారెడ్డి, చెన్నంశెట్టి మురళి, రాయుడు, అప్సర్‌ఖాన్, యూనస్ బాను, సురేష్, సుబ్బారెడ్డి, మాజీ కార్పొరేటర్ సుగవాసి పవన్‌కుమార్ (చిరంజీవి), రాజు వెంకటసుబ్బారెడ్డి, సుగవాసి యువరాజ్, నవీన్, రాజు, పవన్, సుబ్బు, ఆస్మా, మాలన్‌బీ పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో..

కడప నగరం రవీంద్రగనగర్‌లో స్థానికులు అధిక సంఖ్యలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ జిల్లా ధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడుగా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవికుమార్‌రెడ్డి, మల్లిఖార్జున, మాజీ ఎంపీపీ రఘు, సుభాన్, హరితో పాటు పెద్దఎత్తున యువత, మహిళలు టీడీపీలో చేరారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

చంద్రన్న బీమాను రూ. పది లక్షలతో పునరుద్ధరిస్తాం

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 18 : చంద్రన్నబీమా రూ.10లక్షలతో టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని టీడీపీ బెస్తసాధికార కమిటీ రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం కడప నగరం చిన్నచౌకులో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు శాశ్వత కులధృవీకరణ పత్రాలు అందిస్తామన్నారు.

రానున్నది సంక్షేమ ప్రభుత్వం: పుత్తా

- 110 కుటుంబాలు టీడీపీలో చేరిక

కమలాపురం రూరల్, ఏప్రిల్ 18: రానున్నది సంక్షేమ ప్రభుత్వం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చదిపిరాళ్ల గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఆయన సతీమణి సరళమ్మ, పుత్తా కుమార్తె దివ్యశ్రీ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. చదిపిరాళ్ల గ్రామంలో 50 కుటుంబాలు కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని తూర్పుగండ్లూరు కాలనీ, గిడ్డంగుల వీధి సంబంధించి 60 కుటుంబాలు గురువారం పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం నిర్వహించిన పార్టర్ల సమావేశంలో 135 మంది పార్టర్లు పాల్గొన్నారు. టీడీపీని గెలిపించాలని వారిని కోరారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి



లోపట్నూతల గ్రామంలో టీడీపీలో చేరిన వారితో బీటెక్ రవి

లింగాలలో 15 కుటుంబాలు చేరిక

లింగాల, ఏప్రిల్ 18: మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరిని బీటెక్ రవి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వివేక్, అమరేష్, బాల అంకన్న, సూరి, హృతిక్, జితేంద్ర, ముని, అనిల్, ప్రవీణ్, సుభాష్, అనిల్, యశ్వంత్, శ్రీకాంత్, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి.. అభివృద్ధి చేస్తాం

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 18: రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ యువనాయకులు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డి సతీమణి హరితరెడ్డి, కీర్తిశేషులు జ్యోతిరెడ్డి సతీమణి శివమ్మ, యశోద, శ్వేతలు ఓటర్లను అభ్యర్థించారు.

గురువారం వారు మండలంలోని ఎస్.పాలగిరి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సంగమేశ్వర ఆలయం మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, తంగేడుపల్లె శ్రీనివాసులరెడ్డి, ఎస్.పాలగిరి ఐటీడీపీ సూర్యనారాయణరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్.పాలగిరి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పెండ్లిమర్రిలో 30 కుటుంబాలు చేరిక

మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. గురువారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లె, ఇసుకపల్లె పంచాయతీలలో యువనాయకుడు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుత్తా అల్లుడు యశ్వంత్‌రెడిలతో కలిసి పుత్తా నరసింహారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కడప తహసీల్దారుగా వెంకటరమణ

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 18: కడప మండల తహసీల్దారుగా వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి అర్బన్ తహసీల్దారుగా పనిచేస్తూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలానికి బదిలీపై వచ్చారు. కడప తహసీల్దారుగా విధుల్లో ఉన్న శివప్రసాద్ గతనెలలో అవినీతి ఆరోపణలపై ఏసీబీకి చిక్కారు. అప్పటి నుంచి కడప రెవెన్యూ డివిజనల్ పరిపాలనాధికారి రమేష్‌బాబు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి 18 వతేదీ నుంచి నామినేషన్ల పక్రియ ఉండటంతో కడప తహసీల్దారుగా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఒంటిమిట్ట ఇన్‌చార్జి తహసీల్దారుగా ఆర్డీఓ కార్యాలయ ఏఓ రమేష్‌బాబు వ్యవహరించనున్నారు.

గ్రామగ్రామాన టీడీపీ విస్తృత ప్రచారం

చెన్నూరు, ఏప్రిల్ 18: చెన్నూరు మండలంలోని ఉప్పరపల్లె, ముండ్లపల్లె, రామనపల్లె, ఓబులంపల్లెలో గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉప్పరపల్లెలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, చెన్నూరులో మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, రామనపల్లెలో జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్, ఓబులంపల్లెలో జిల్లా అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి, ముండ్లపల్లెలో జిల్లా రైతు విభాగం నాయకులు అల్లాడు రాజశేఖర్‌రెడ్డి ప్రచారం చేశారు.

అభివృద్ధి రథసారధి చంద్రబాబుకు పట్టం కట్టండి

సింహాద్రిపురం, ఏప్రిల్ 18: అభివృద్ధి రథసారధి చంద్రబాబుకు పట్టం కట్టాలని టీ డీపీ నేతలు ప్రజలను కోరారు. గురువారం పైడిపాళెం, నంద్యాలంపల్లి, చవ్వారుపల్లి గ్రామాల్లో పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) సోదరులు మారెడ్డి జయభరత్‌రెడ్డి, మారెడ్డి జోగిరెడ్డి, బీటెక్ రవి కుమారుడు మారెడ్డి రామ్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ప్రజలకు చేసే సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



పైడిపాళెంలో ఎన్నికల ప్రచారంలో బీటెక్ రవి సోదరుడు జయభరత్‌రెడ్డి

ఓటు హక్కును వినియోగించుకోండి: సీఐ

కడప (క్రైం), ఏప్రిల్ 18 : ఎన్నికల సమయంలోస్వేచ్ఛగా ఓటు వేసేందుకు ప్రతి ఓటరుకు భద్రత కల్పిస్తామని వారు ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ భాస్కర్‌రెడ్డి కోరారు. కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో స్థానికులకు గురువారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. కడపనగరం హౌసింగ్‌బోర్డు కాలనీలో స్థానికులకు గురువారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. వన్‌టౌన్ పరిధిలో ఎవరైనా ఓటర్లను ప్రలోభ పెట్టినట్లు తెలిసినా అలాగే అసాంఘిక కార్యకలాపాలపై కూడా సమాచారం అందించాలన్నారు.

భక్తుల పాలిట కొంగుబంగారం మహాకాళీ అంకాలమ్మ

వల్లూరు, ఏప్రిల్ 18 :భక్తుల పాలిట కొంగు బంగారమై, కోర్కెలు తీర్చే అమ్మవారుగా పూజలందుకుంటున్న మహా కాళీ అంకాలమ్మ దేవి తిరుణాల మహోత్సవం ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. 22న సాయంత్రం కొర్లబండి తిరుగుతుందన్నారు. 21న బండలాగుడు పోటీలు న్యూ కేటగిరి ఎద్దులచే ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ అంకాలమ్మ తిరుణాల మహోత్సవంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు. అలాగే ఏడు గ్రామాల ఊరేగింపు కార్యక్రమం కూడా మొదలుపెట్టామ వారు వివరించారు.



మూలవిరాట్ అంకాలమ్మ

శ్రీరామనవమి వేడుకల్లో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

వేంపల్లె, ఏప్రిల్ 18: శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె గ్రామంలో సీతారాముల గ్రామోత్సవం సందర్భంగా ఈ అపశృతి చోటుచేసుకుంది. ఊరేగింపు సమయంలో మెరవణి పైభాగం విద్యుత్ తీగలు తగిలి షార్ట్‌సర్క్యూట్ కావడంతో చంద్ర ఓబుళరెడ్డి (48) అనే వ్యక్తి మృతిచెందాడని సీఐ చాంద్‌బాష తెలిపారు. సుమంత్‌రెడ్డి, గంగాప్రసాద్‌రెడ్డికి గాయాలయ్యాయి. ప్రతిఏట వేడుకగా నిర్వహించే శ్రీరామనవమి పర్వదినంను బుధవారం అర్ధరాత్రి దాటాక ఆలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగుగంటల ప్రాంతంలో ఊరేగింపులో విద్యుత్‌తీగలు తగిలి షార్ట్‌సర్క్యూట్‌కు గుర్యారు. ఒకరు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా, క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి ఇతర నాయకులు మృతదేహాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మృతిచెందిన చంద్ర ఓబుళరెడ్డి

'జగన్‌రెడ్డి పాలనలో దళితులకు రక్షణ కరువు'

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 18: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దళితులకు రక్షణ కరువైందని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను శిరోముండనం చేసి జైలుకు వెళ్లిన తోట త్రిమూర్తులు అనే నాయకుడికి బెయిల్ ఇప్పించి మరీ మండపేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా నిలబెట్టి గెలిపించాలని జగన్‌రెడ్డి వత్తాసు పలకడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా గురువారం కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బోద ఇల్లు దగ్ధం

అట్లూరు, ఏప్రిల్ 18 : అట్లూరు మండలం కుంభగిరి బీసీ కాలనీకి చెందిన పాపయ్య బోద ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో గురువారం ఉదయం దగ్ధం మైంది. దీంతో అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజనుతో మంటలు ఆర్పారు. ఏఎస్ఐ మోహన్‌బాబు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలుతెలుసుకున్నారు. సుమారు ఇంటి పైకప్పు సామాన్లు, వ్యవసాయ పనిముట్లు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

గడ్డివామి...

ముద్దనూరు ఏప్రిల్18: మండల పరిధి నల్లబల్లె గ్రామంలో గురువారం సాయంత్రం గడ్డివామికి నిప్పు అంటుకొని దగ్ధమైంది. గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక వైపు కల్లాల్లో ఏర్పాటు చేసిన కంభం మహేశ్వరరెడ్డికి చెందిన పెద్ద గడ్డివామికి నిప్పు తగలడంతో మంటలు చెలరేగాయి. అది గమనించిన ప్రజలు మంట ఆర్పేందుకు ప్రయత్నించారు. మంట అదుపుకాకపోవడంలో జమ్మలమడుగు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

మైలవరం, ఏప్రిల్ 18: మైలవరం జలాశయ పడమటి కొండపై వెలసిన హజరత్ సయ్యద్‌షా పీర్ గైబుసావలి ఉరుసు మహోత్సం గురువారం ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి మైలవరం డ్యాం దండే షేక్షావలి ఇంటి వద్ద నుంచి గంధం తీసుకుని కొండపై దర్గా వద్ద చేరుకుని ఉరుసు మహోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలీ పోటీ కార్యక్రమం భక్తులను అలరించింది.

స్థలం కోసం ఘర్షణ

ముగ్గురిపై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18 : మూడు సెంట్ల స్థలం కోసం జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి గాయం కాగా ఆ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని కమ్మవారిపల్లెలో మూడుసెంట్ల స్థలం కోసం జరిగిన వివాదంలో పి.వెంకటరమణ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ముగ్గురు బుధవారం రాత్రి గాయపరిచారని, గురువారం అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టీడీపీలోకి విస్తృతంగా వలసలు





బీ కోడూరులో రితీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన నేతలు, మైదుకూరు.. పుట్టా సమక్షంలో పార్టీలో చేరిన మాచుగారిపల్లె నాయకులు

బి.కోడూరు, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని మేకవారిపల్లె గ్రామ పంచాయతీలో మాజీ ఎంపీపీ బోరెడ్డి పద్మావతి, మాజీ సర్పంచ్ బోరెడ్డి శేషారెడ్డితో పాటు వారి ఆధ్వర్యంలో దాదాపు 200 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలో చేరారు. అలాగే యువ నాయకులు రితీష్ సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే ఆనంవారిపల్లె గ్రామంలో జయరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డితో పాటు దాదాపు 50 కుటుంబాలు, అలాగే అక్కుపాలెం గ్రామంలో నాగూరు నాగయ్య, నడిపి పీరయ్య, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు గురువారం యువ నాయకులు రితీష్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి రోశన్న, రాష్ట్ర రైతువిభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, బీజేపీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, గోడిభాస్కర్‌రెడ్డి, కలసపాడు మాజీ జడ్పీటీసీ భూపాల్‌రెడ్డి, అలాగే మాజీ జడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి, దుగ్గిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పవన్, నవీన్, సిద్దుగారిపల్లె నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి,పరిటాల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మండలంలోని మాచుగారిపల్లెగ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, దువ్వూరుకు చెందిన ప్రముఖ న్యాయవాది సుధాకర్ స్వామి అనుచరవర్గం ఇరువురు కలిసి వంద కుటుంబాలు మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుదాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గుండయ్య,రామమోహన్,సుదర్శన్,వీరారెడ్డి,నారుబోయిన బాల,రాజా రావు,అంకయ్యనడిపి ఓబయ్య,కరుణాకర్, జయరాజ్,రాజేష్, రత్నమయ్య,ఆనంద్ తదితరుల ఉన్నారుఈ కార్యక్రమంలో భీమయ్య,పోలిరెడ్డి, కిశోర్, మల్లికార్జున్,గోవిందరెడ్డి పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని రాజువారిపేట గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలవారు టీడీపీలో చేరినట్లు మైదుకూరు టీడీపీ అభ్యర్థి అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో చెన్నకిశోర్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, వీరారెడ్డి, రామసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, ఇంకా 45 కుటుంబాలవారు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గురివిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట..: మండల పరిధిలోని బుడ్డాయపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున, చంద్రాయుడు వారి అనుచర వర్గం దాదాపు 40 కుటుంబాలు ప్రొద్దుటూరులో పుట్టాసుధాకర్ యాదవ్ స్వగృహంలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, బుడ్డాయపల్లె గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భూపేశ్‌కు ఎన్టీఆర్ చిత్రపటం బహూకరణ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 18: టీడీపీ ఎంపీ అభ్యర్థి దేవగుడి భూపేశ్‌రెడ్డి ఎంపీగా విజయకేతనం ఎగురవేయాలని నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికం సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో భూపేశ్‌రెడ్డిని ఘనంగా సత్కరించి ఎన్టీరామారావు చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, గురప్పయాదవ్, మల్లికార్జున, రామూనాయుడు, లక్ష్మీనరసింహ, సుబ్బరాజు, సిద్దయ్య, నందమూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలిస్తేనే రాష్ట్రం అభివృద్ధి

కొండాపురం, ఏప్రిల్ 18 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు. ఎన్డీయే కూటమి తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.మండలంలోని కె.సుగుమంచిపల్లె, జోగాపురం గ్రామాలలో గురువారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,పాల్గొన్నారు.

మైలవరం..: ఎన్డీయే కూటమి తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డి, కడప ఎంపీగా భూపేశ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదిపిరాళ్ల గోవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నవెంతుర్ల, బెస్తవేముల, బి.జంగాలపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు శివరామి రెడ్డి, వెంకటేశ్వర్లు, కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, కర్నాటి రామాంజనేయ రెడ్డి, సుధాకర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి ఆది సతీమణి ప్రచారం



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 18: జమ్మలమడుగు ఎన్డీయే అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేస్తున్న సి.ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ గురువారం ఎర్రగుంట్లనగర పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఎర్రగుంట్లలోని 17, 18వార్డులో ఆమె బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఆదినారాయణరెడ్డిని, ఎంపీగా పోటీ చేస్తున్న సి.భూపేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎం.జగన్‌మోహన్ రెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, లాడ్జీ అంకిరెడ్డి, చాంద్‌బాషా, చిన్నసేట్, సుంకరనాగేశ్వరరావు, జంగంరెడ్డి, షరీఫ్, కొండారెడ్డి, రమేష్‌రెడ్డి, బియ్యంబాషా, పొట్టి మాబు, బంగారురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఎర్రిస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను సాగనంపండి



ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18 : ఐదేళ్ల అరాచక పాలన చేసిన వైసీపీని సాగనంపాలని బద్వేలు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. గురువారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాత పోస్టాఫీసు వీధి, కొత్త కుమ్మరివీధి, ఐఎన్‌రెడ్డి బిల్డింగ్స్, 60వ బూత్ పరిధిలోని ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

బద్వేలు , ఏప్రిల్ 18 : ఎన్‌డీఏ కూటమిలో భాగంగా బద్వేలు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నబొజ్జ రోశన్నను గెలిపించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి కోరారు. గురువారం పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డు, గాండ్లవీధుల్లో ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు వెంకటరమణయ్య, అసెంబ్లీ కన్వీనరు భాస్కర్‌రెడ్డి, రవికుమార్, పవన్‌కుమార్, మాదాసురేంద్ర, వెంకటసుబ్బారెడ్డి, కుప్పాల రమణయ్య, సతీష్‌రెడ్డి, కుప్పాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాలరాజుపల్లెలో ఇంటింటి ప్రచారం

కాశినాయన ఏప్రిల్18: బద్వేల్ నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్నను కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి కోరారు. గురువారం బాలరాజుపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మినీ మేని ఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరత్రాలు పంపిణీచేశారు.పలువురు టీడీపీ,బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రోశన్న గెలుపు కోసం ప్రచారం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18 : బద్వేలు బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం ఆయన టేకూరుపేట గ్రామంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థి రోశన్నను గెలిపించాలని కోరారు. అలాగే మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు.

పుట్టాను ఆదరించండి

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 18 : మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఆదరించాలని మండల ఎన్నికల ప్రచారాల సమన్వయ కర్త పుట్టా ఆనంద్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం బి.మఠం మండలంలోని జెడ్.కొత్తపల్లె, డి.అగ్రహారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్బారావు, కొండా ఓబయ్య, పెరుగు వీరయ్య, పెరుగు సుధాకర్, చెన్నయ్య, శివ, మల్లికా ర్జునరెడ్డి, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, బయనబోయిన గురప్ప, దాదిబోయిన సుబ్బరాయుడు, నాగేశ్, ఓబయ్య, వెంకటేశ్‌నాయుడు, గంగినాయుడు, నగేశ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో కానరాని అభివృద్ధి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 18 : వైసీపీ ప్రభుత్వం లో పంచాయితీల్లో అభివృద్ధి ఎక్కడా కానరావడంలేదని మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పేర్కొన్నారు. గురువారం సోముల వారిపల్లె లోని 11,12,13 వార్డులలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్లర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, వైఎస్ మహ్మద్ గౌస్, నల్లబోతుల నాగరాజు, పుల్లయ్య, పల్లేటి రాముడు సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, షామీర్ ,షరీఫ్ కవి, రంగడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'దుర్మార్గపు పాలనను గద్దె దింపుదాం'

ఖాజీపేట, ఏప్రిల్ 18: రాష్ట్రంలో కొనసాగుతున్న దుర్మార్గపు పాలనను గద్దె దించుదామని టీడీపీ మండల ఇన్‌చార్జి పుట్టా వెంకటస్వామిరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం చెర్లోపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు గోవిందు సుబ్బయ్య, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, హర్షద్, మురళీమోహన్‌రెడ్డి, రమేష్‌నాయుడు, కిశోర్‌కుమార్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నామినేషన్ల ప్రక్రియ



నామినేషన్ పత్రాలు ఆర్వో శ్రీనివాసులకు అందజేస్తున్న అరుణ

జమ్మలమడుగు, ఏప్రిల్ 18: జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ కేంద్రమైన ఆర్డీవో కార్యాలయంలో గురువారం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పక్రియ జోరుగా సాగింది. మొదటిరోజు జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి మధ్యాహ్నం దాకా రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొదట మైలవరం మండలం దన్నవాడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అల్లె ప్రభావతి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులుకు అందజేశారు. అలాగే జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి తరుపున ఆయన సతీమణి చదిపిరాళ్ల అరుణ నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులుకు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం చుట్టూ కేంద్ర సాయుధ బలగాలు స్థానిక పోలీసు బందోబస్తుగా ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయండి : డీఎల్

ఖాజీపేట, ఏప్రిల్ 18: ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదేనని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో కొత్తపేట, చెముళ్లపల్లె గ్రామాల టీడీపీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్యం వెంకటరామిరెడ్డి, బుచ్చిరెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తులసి జనార్థన్‌రెడ్డి, హరినాథరెడ్డి, వెంకటసుబ్బయ్య, రామకృష్ణ, వెంకటరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామిరెడ్డి, కొమ్మలూరు భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో మొదటిరోజు నామినేషన్ నిల్

బద్వేలు, ఏప్రిల్ 18: బద్వేలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. మొదటి రోజు నామినేషన్లు ఎవరూ దాఖలు చేయలేదని ఎన్నికల అధికారి ఆకుల వెంకటరమణ తెలిపారు.

చేనేత పరిశ్రమను ఆదుకుంటాం

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి



చేనేత సొసైటీల యజమానులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపేశ్, ఆది

జమ్మలమడుగు, ఏప్రిల్ 18: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అయిదు సంవత్సరాల పరిపాలనలో చేనేత సొసైటీలకు, చేనేత కార్మికులకు దగా చేశారని, అధికారంలోకి రాగానే చేనేత పరిశ్రమను ఆదుకుంటామని టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాల చేనేత సొసైటీల ప్రెసిడెంట్లు, నాయకులు తదితరులు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతలకు రావాల్సిన బకాయిలు, సొసైటీల సమస్యలు, చేనేత పథకాలను అమలు, జమ్మలమడుగులోని చేనేతలను అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డికి కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు సున్నపురాళ్లపల్లె కాటిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, పొన్నతోట శ్రీను, చౌడం జొల్లు పాండు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పునరుద్ధరిస్తాం : వరద



ప్రచారం నిర్వహిస్తున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 18:టీడీపీ ప్రభుత్వం రాగానే ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీలకు కార్పొరేషన్లద్వారా సబ్సిడీరుణాలు పునరుద్ధరిస్తామని వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం 40వ వార్డులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా కూటమిలోని మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలపై ప్రచారం చేశారు. ప్రొద్దుటూరులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా నంద్యాలవరదరాజులరెడ్డిని ఎంపీగా భూపేశ్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి, వీఎస్ ముక్తియార్, ఈవీసుధాకర్‌రెడ్డి, దేవగుడి వేణుగోపాల్‌రెడ్డి, జనసేన ప్రతినిధి జిలాన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, చౌడం వెంకట కొండయ్య, సిరివెళ్ళ వెంకట సుబ్బయ్య, అవ్వారు రమణ, అంజనమ్మ, సోమా బాలయ్య, గంజికుంట అంజనేయులు, వద్దిబాలుడు,బోగా వీరయ్య పాల్గొన్నారు.

ఏడాదికి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం

వరద కుమార్తెలు మెట్టుపల్లె అనురాధ, వెన్నపూస అరుణ, కోడలు మీనా




ప్రచారంలో పాల్గొన్న వరద కుటుంబసభ్యులు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 18 : మహిళలకు ఇంటింటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చంద్ర బాబు ప్రకటించారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కుమార్తెలు మెట్టుపల్లి అనురాధ, వెన్నపూస అరుణ,కోడలు నంద్యాల మీనా తెలిపారు. గురువారం 6 వవార్డులో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా వరదరాజులరెడ్డిని, ఎంపీగా భూపేశ్‌రెడ్డిని గెలిపించాలని సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నల్లబల్ల భాగ్యమ్మ, ఎర్రన్న,బోగాల లక్ష్మీనారాయ ణమ్మ, బోగా శివకల్యాణి,లక్ష్మీ, శైలజా తాటి శ్రీనివాసుల యాదవ్ పాల్గొన్నారు.

ఓటమి భయంతో తప్పుడు ఆరోపణలు చేస్తే జనం నమ్మరు

చందాల కోసం వ్యాపారులను వేధించినట్లు నిరూపిస్తే నామినేషనే వేయను ● వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లుకు వరదరాజులరెడ్డి సవాల్



ప్రొద్దుటూరు , ఏప్రిల్ 18 : ప్రొద్దుటూరు ఎన్నికల బరిలో తనను ఎదుర్కోలేక ఓటమి భయంతో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేసి బురదజల్లాలనుకుంటే జనం నమ్మరని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో వ్యాపారులను చందాలు ఇవ్వమని తాను వేధిస్తున్నానని రాచమల్లు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. ఏ ఒక్క వ్యాపారితో తాను వేధించినట్లు ప్రకటించి నిరూపిస్తే నామినేషన్ కూడా వేయనని రాచమల్లుకు సవాల్ విసిరారు. తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకం లాంటిదన్నారు.ఇప్పుడే కాదు గతంలో తాను 25 ఏళ్ళు ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఎవ్వరినీ చందాలివ్వాలని ఒత్తిడి చేసిన దాఖలాలు లేవని వరద పేర్కొన్నారు. ఆ వేధింపుల సంస్కృతి రాచమల్లుకు వుందన్నారు. అందుకే రాచమల్లు నేరుగా తనకు ఓటు వేయమని అడగటం లేదన్నారు. జగన్‌కు వేయమని ఆయన కోరుతున్నారన్నారు. జగన్ బొమ్మతో గెలిచేవాడివి తప్ప సొంత బలంతో గెలిచే సత్తా లేదన్నారు. ప్రొద్దుటూరు ప్రజలే తనకు ఆస్తి అన్నారు. వారి ఆశీస్సులతోనే రాజకీయాల్లో కొనసాగుతున్నానన్నారు. ప్రొద్దుటూరు లో రాచమల్లు ఆయన బావ, అన్నల ఆగడాలు భరించలేకనే తనను తిరిగి రాజకీయాల్లోకి ప్రజలు ఆహ్వానించారన్నారు. వారి ఆదరాభిమానంతోనే ఎలాంటి పైరవీలు లేకనే టీడీపీ టిక్కెటు వచ్చిందన్నారు. తన దగ్గర డబ్బులు లేవని తెలిసినా ప్రజలే తనను గెలిపించుకుంటారన్నారు. కాగా బుధవారం శ్రీనివాసనగర్ ప్రచారంలో అంజుమన్ అధ్యక్షుడు బొల్లవరం బాషా మా వెంట ప్రచారంలో పాల్గొన్నాడన్నారు. ఆయనను మేమేమి బలవంతం చేయ లేదన్నారు. ఆయనకు బలవంతంగా కండువా కప్పాల్సిన అవసరం మాకు లేదన్నారు. బొల్లవరం బాషాకు, రాచమల్లుకు వ్యాపార లావాదేవీలు వుండటం వలన తప్పని పరిస్థితులలో ఆయనతో ఎమ్మెల్యే రాచమల్లు పక్కన కూర్చోని మాట్లాడించారన్నారు.

'పుట్టాకు ఒక్క అవకాశం ఇవ్వండి'

మైదుకూరు రూరల్ ఏప్రిల్18 : మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఈ సారి ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని గురువారం పాతూరు టీడీపీ ఎన్నికల ప్రచారంలో యాపరాల చిన్న కోరారు. మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధి పుట్టాతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 15 వార్డు కౌన్సిలర్ రాధాక్రిష్ణ, మాజీ సర్పంచ్ బీఎన్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఆకేటి శ్రీను,బురుగోళ్ల చిన్న,చెంచు రామయ్య,మల్లేష్,సత్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్ర పురోగతి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 18 : కూటమి విజయంతోనే రాష్ట్ర పురోగతి ఆధారపడి ఉందని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని వల్లెలవారిపల్లెలో బీజేపీ ఉమ్మడి అభ్యర్థి రోశన్నను గెలిపించాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.